ఘోరంగా చంపేశాడమ్మా..!

- నా బిడ్డను బూడిద చేశాడే..
- ఇప్పుడెవరి కోసం బతకాలి
- గుండెలవిసేలా రోదించిన లహరి తల్లి
- కలకలం రేపిన నందికొట్కూరు ఘటన



రోదిస్తున్న విద్యార్థిని లహరి తల్లి లక్ష్మి

నందికొట్కూరు/కర్నూలు హస్పిటల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 'అమ్మా.. అమ్మా అంటుంటివే..! అమ్మా నేను బాగా చదివి ఇంజనీరు అవుతా.. నిన్ను బాగా చూసుకుంటా.. మన కష్టాలు తీరిపోతాయని అంటివే..! నా పిల్లను ఘోరంగా చంపినాడు.. బూడిద చేసినాడు.. ఉన్న ఒక్కగానొక్క బిడ్డ అన్యాయమైపోయినాది సారూ. నేనెవరి కోసం బతకాలి. నాకు భర్త లేడు.. ఆ పిల్ల ఒక్కటే నాకు దిక్కు. ఆ పిల్లను చూసుకుంటూ ఇన్నాళ్లు బతికినాను.. కూలినాలి చేసుకుంటూ చదివించినాను.. నా పిల్లను చంపేసినాడు కదయ్యా..! నా బిడ్డే నా జీవితం అనుకొని ఇన్నాళ్లు బతికినాను.. నా బిడ్డే లేకుంటే నేనెవరి కోసం బతకాలి.. అంటూ ప్రేమోన్మాది చేతుల్లో దారుణ హత్యకు గురైన ఇంటర్ విద్యార్థిని ఇంజమూరి లహరి తల్లి లక్ష్మి గుండెలవిసేలా రోదించింది. బిడ్డ పుట్టిన నెల రోజులకే భర్త శివరామ కృష్ణ మృత్యువాత పడితే.. బిడ్డ లహరిలోనే వాళ్ల నాన్నను చూసుకుంటూ అన్నీతానై ఆ చిన్నారిని పోషించింది. కూతురుని చదివించి ఉన్నతంగా చూడాలని ఎన్నో కలలు కంటే.. ఇంతలోనే ప్రేమోన్మాదం తన కూతురు పొట్టనపెట్టుకుంది. ఈ విషాద ఘటన నంద్యాల జిల్లా నందికొట్కూరులో సోమవారం చోటుచేసుకుంది. అవ్వా తాతల ఇంట్లో ఉంటూ ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ చదువుతున్న లహరిని పడుకున్న గదిలోనే ప్రేమోన్మాది రాఘవేంద్ర పెట్రోల్ పోసి నిప్పంటించడంతో ఆ యువతి సజీవ దహనమైంది. ఆ మంటల్లోనే చిక్కుకున్న ఆ యువకుడు కూడా తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు.



(లహరి ఫైల్)



తీవ్ర గాయాలపాలైన రాఘవేంద్ర



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

వివరాలు మెయిన్‌లో..

నందికొట్కూరు పట్టణంలో ఇంటర్మీడియట్ చదువుతున్న లహరి మృతిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. వెల్దుర్తి మండలం రామళ్లకోట గ్రామానికి చెందిన లక్ష్మి కూతురు లహరి(17) నందికొట్కూరులోని అవ్వాతాతలు పార్వతి, మాదవయ్య వద్ద ఉంటూ ఇంటర్మీడియట్ చదువుతోంది. లక్ష్మి భర్త కుమార్తె పసిబిడ్డగా ఉన్నప్పుడే మృతి చెందాడు. లహరి పదో తరగతిలో తనకు సీనియర్ అయిన వెల్దుర్తి మండలం కలుగొట్ల గ్రామానికి చెందిన రాఘవేంద్ర(21)తో సన్నిహితంగా ఉండేది. అప్పటి నుంచే ఇద్దరు ఫోన్‌లో మాట్లాడుకుంటూ ఉండేవారు. రాఘవేంద్ర ఆదివారం నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరులో నివాసం ఉంటున్న తన అక్కాబావల ఇంటికి వచ్చాడు. అదే రోజు రాత్రి లహరి, రాఘవేంద్రలు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. నందికొట్కూరులో నివాసం ఉంటున్న లహరి ఇంటికి రాత్రి 11.30 గంటల ప్రాంతంలో రాఘవేంద్ర వచ్చాడని పోలీసులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే లహరి మృతి చెందడం కలకలం రేపింది. ఆమె మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇద్దరు రూంలో ఉండగా షార్ట్‌సర్క్యూట్ జరిగిందా.. లేక ఇద్దరు కలిసి ఆత్మహత్యాయత్నం చేశారా.. లేక లహరిని రాఘవేంద్రే హత్య చేశాడా.. లేదంటే ఇద్దరు గదిలో ఉండగా ఎవరైనా నిప్పు అంటించారా అన్న అనుమానాలను పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. లహరి బంధువులు, కుటుంబ సభ్యులు మాత్రం రాఘవేంద్ర పెట్రోల్ పోసి నిప్పు అంటించాడని ఆరోపిస్తున్నారు.

చట్టపరిధిలో న్యాయం చేస్తాం: ఏఎస్పీ

నంద్యాల క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విచారణ జరిపి చట్టపరిధిలో న్యాయం చేస్తామని ఏఎస్పీ ఏఎస్పీ ఎన్.యుగంధర్‌బాబు అన్నారు. నంద్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఏఎస్పీ ఎన్.యుగంధర్‌బాబు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి 70 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తి స్థాయిలో చట్టప్రకారం విచారణ జరిపి పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్టపరిధిలో వీలైనంత త్వరగా సమస్యలకు పరిష్కారం చూపాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సివిల్ తగాదాలు, కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేయడాలు, అన్నదమ్ముల ఆస్తి పంపకాల్లో మనస్పర్థలు తదితరాలు ఉన్నాయి. కార్యక్రమంలో పలువురు ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

జలాధివాసాన్ని వీడుతున్న సంగమేశ్వర ఆలయం



కృష్ణానది నీటి నిల్వల నుంచి బయల్పబడిన ఆలయ శిఖరం

కొత్తపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సప్తనదీ జలాల నుంచి సంగమేశ్వర ఆలయ శిఖరం మెల్లమెల్లగా బయల్పడు తోంది. శ్రీశైలం ప్రాజెక్టు నీటి మట్టం క్రమేణ తగ్గుతూ సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి ప్రాజెక్టు వద్ద పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా 864.30 అడుగులకు చేరుకుంది. అలాగే ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వలు 215 టీఎంసీలు కాగా 120.0754 టీఎంసీలుగా నమోదైంది. దీంతో ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ కృష్ణానదిలో మరబోటు ద్వారా వెళ్లి ఆలయ శిఖరంపై శివుని ప్రతిమకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాగు, తాగునీటి అవసరాల కోసం నీటి విడుదల కొనసాగిస్తే సంక్రాంతి తర్వాత పూర్తి స్థాయిలో ఆలయం బయల్పడే అవకాశం ఉందన్నారు. శిఖరం బయల్పడటంతో భక్తులు ఎగువ ఉమామహేశ్వర స్వామి ఆలయం నుంచి భక్తులు ఫొటోలు తీసుకున్నారు. అలాగే సప్తనదుల్లో పుణ్యస్నానాలు ఆచరించి ఎగువ ఉమామహేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

ప్రగతి పథంలో నడిచేనా..! 7

రైతులతోనే విత్తనోత్పత్తి చేయించండి

ఏపీ సీడ్స్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి

డెయిరీ నామినేషన్‌లో ఉద్రిక్తత

- నగల్లపాడులో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య వాగ్వాదం
- తమ ఓట్లు నమోదు చేయలేదంటూ టీడీపీ వర్గీయుల ఆందోళన
- మోహరించిన పోలీసు బలగాలు
- వాయిదా పడ్డ నామినేషన్



సీఐ, ఎస్ఐలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

చాగలమర్రి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నగల్లపాడు గ్రామంలో పాల డెయిరీ నామినేషన్‌ల ప్రక్రియ సోమవారం ఉద్రిక్తంగా మారింది. పాల డెయిరీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న గంగుల విజయసింహారెడ్డి తిరిగి ఈ ఎన్నికల్లో నామినేషన్ వేసేందుకు గ్రామానికి వచ్చారు. అయితే 19 మంది మాత్రమే ఓటర్లు ఉన్నారని, వీరంతా వైసీపీ వర్గీయులే అని, వీరు గత కొన్నేళ్లుగా ఓటర్లుగా ఉన్నారని, తాము పాల ఉత్పత్తిదారులుగా కొనసాగుతున్నా తమ ఓట్లు ఎక్కించడం లేదని టీడీపీ వర్గీయులు దస్తగిరి, బాలదస్తగిరి మరి కొందరు ఎన్నికల అధికారికి, ఎస్సైకి ఫిర్యాదు చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని వారు ఆరోపించారు. ఈ 19 మంది ఓటర్లలో నలుగురు పాలు పోయకున్నా వారి పేర్లను ఓటర్లుగా కొనసాగిస్తున్నారని, తాము 30 మందికి పైగా పాలు పోస్తున్నా ఓటర్లుగా నమోదు చేయలేదని టీడీపీ వర్గీయులు ఆరోపించారు. తమ పేర్లను కూడా ఓటర్లుగా నమోదు చేయాలని ఎన్నికల అధికారి చంద్రకు వినతిపత్రం తెలియజేశారు. ఈ సమస్యలు పరిష్కరించకుండా నామినేషన్‌లు వేయడానికి వీలు లేదని టీడీపీ వర్గీయులు పట్టుబట్టారు. దీంతో గ్రామంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం నెలకొనడంతో పరిస్థితి ఉత్కంఠగా మారింది. ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరి రాముడు, ఎస్ఐ రమేష్‌రెడ్డి, పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. ఎన్నికల అధికారి, పాల డెయిరీ అధ్యక్షుడు విజయసింహారెడ్డితో చర్చలు జరుపుతుండగా మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, వైసీపీ నాయకులు గ్రామానికి చేరుకున్నారు. దీంతో సీఐ, ఎస్ఐలతో మాజీ ఎమ్మెల్యే చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సోదరుడు విజయసింహారెడ్డి పాల డెయిరీ అధ్యక్షుడుగా కొనసాగుతున్నారని అన్నారు. పాల ఉత్పత్తిదారులు తమ వర్గానికి చెందిన వారని, అలాంటప్పుడు నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం మంచి పద్ధతి కాదని అన్నారు. పోలీసు అధికారులు నామినేషన్లు జరిగేలా చూడాలని అన్నారు. సీఐ కంబగిరిరాముడు కలుగజేసుకొని పోలీసు విధులకు ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవని, నిబంధనల మేరకు ఎన్నికలు జరుగుతాయని తెలియజేశారు. నామినేషన్ వేసే వరకు వెళ్లేది లేదంటూ వైసీపీ వర్గీయులు గ్రామంలోనే మకాం వేశారు. ఇరువర్గాలు గ్రామానికి చేరుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. చివరకు ఆళ్లగడ్డ రూరల్ సీఐ, ఎస్ఐలు కలుగజేసుకొని పరిస్థితి శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఉందని, ఎన్నికల నామినేషన్ వాయిదా వేయాలని ఎన్నికల అధికారి చంద్రకు లిఖితపూర్వకంగా తెలియజేశారు. ఎన్నికల అధికారి స్పందించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నామినేషన్ వాయిదా వేస్తున్నామని, తిరిగి తేదీ మళ్లీ ప్రకటిస్తామని అన్నారు. పాల కేంద్రం వద్ద నామినేషన్ వాయిదా పత్రాన్ని అంటించారు. నామినేషన్ వాయిదా వేయడంతో ఇరువర్గాల నాయకులు వెనుతిరిగి వెళ్లారు. దీంతో పోలీసులు, గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. శిరివెళ్ల సీఐ వంశీధర్, ఆళ్లగడ్డ టౌన్ సీఐ చిరంజీవి, ఎస్ఐలు వెంకటేష్, ఏఎస్ఐలు, పోలీసులు, స్పెషల్ దళాలతో బందోబస్తు నిర్వహించారు.

ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై దృష్టి పెట్టండి

కలెక్టర్ రాజకుమారి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి, అధికారులు

నంద్యాల కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలులో జిల్లాను ముందు స్థానంలో ఉంచేందుకు కృషి చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో కోఆర్డినేషన్ అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన ప్రతి ఫిర్యాదుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పరిష్కరించాలని అన్నారు. 141 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారని తెలిపారు. ఈ సమస్యలన్నీ ఎస్ఎల్ఏ లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. డీఆర్డీఏ, డీఎంహెచ్ఓ ఇతర శాఖలు ప్రాధాన్యత కార్యక్రమాల లక్ష్య సాధనలో కుంటుపడిన అంశాలను తన దృష్టికి తీసుకు వచ్చి సమీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తొలి రోజు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై 430 గ్రీవెన్స్ వచ్చాయని వీటన్నింటిని ఆన్‌లైన్ చేసి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీఆర్ఓ, ఇరిగేషన్ ఎస్ఈని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాని, ఫ్రీహోల్డ్ భూముల డేటాను కూడా వేగవంతం చేయాలన్నారు.

టీడీఆర్ బాండ్లపై విజిలెన్స్ పంజా..!

- అక్రమాలు నిజమే?
- మార్కెట్ విలువ పెంచి బాండ్లు జారీ
- అవకతవకలు జరిగినట్లు గుర్తించిన అధికారులు
- ఐదు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆర్‌వీఈఓ ఎస్పీ కె. చౌడేశ్వరి ఆదేశం



కర్నూలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్ల అక్రమాలు, అవకతవకలు వాస్తవమే. బాండ్లు జారీ చేసిన ప్రదేశాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించాం. అవసరమైన రికార్డులు సేకరించి విశ్లేషిస్తే ఎన్నో లోపాలు వెలుగు చూశాయి. కల్లూరు, కర్నూలు సబ్ రిజిస్ట్రార్ విలువ కంటే ఎక్కువ విలువకు బాండ్లు జారీ చేశారు. బాండుదారులకు లబ్ధి చేకూర్చే దురుద్దేశంతోనే మార్కెట్ విలువ పెంచారని స్పష్టమవుతోంది. దీనిపై ఐదు రోజుల్లోగా వివరణ ఇవ్వాలి అంటూ ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్, ఎస్పీ కె. చౌడేశ్వరి సోమవారం కర్నూలు నగర పాలక సంస్థ సిటీ ప్లానర్ (సీపీ) ప్రదీప్‌కుమార్‌కు లేఖ రాశారు. అదే క్రమంలో పలువురు బాండ్ పొందిన వ్యక్తులు సబ్ రిజిస్ట్రార్ జారీ చేసిన విలువ పత్రాలు అప్‌లోడ్ చేయలేదు. ఆ వివరాలు ఇవ్వాలంటూ కమిషనర్‌కు మరో లేఖ రాశారు. టీడీఆర్ బాండ్ల జారీలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ అధికారులు పంజా విసరడంతో కార్పొరేషన్‌లో కలకలం మొదలైంది. వైసీపీ హయాంలో నిబంధనలు తుంగలో కలిపేసి ఇష్టారాజ్యంగా టీడీపీ బాండ్లు జారీ చేసి ప్రజాధనం దుర్వినియోగం చేశారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఈ వ్యవహారంపై ఆంధ్రజ్యోతి వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చింది.

కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో భూ సేకరణ చేయలేదు. ఎప్పుడు చేస్తారో కూడా తెలియదు. భూ సేకరణకు నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. అయితే మాస్టర్ ప్లాన్‌లో ఆ స్థలాలు, భూములు ఉన్నాయనే ఒకేఒక కారణంతో విచ్చల విడిగా ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్లు జారీ చేశారు. గత జగన్ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో రూ.వంద కోట్లకు పైగా విలువ చేసే 135 బాండ్లు జారీ చేయడం వెనుక గత అధికార వైసీపీ ముఖ్యనేతల పాత్ర ఉందని, టీడీఆర్ బాండ్ల జారీ రూపంలో కార్పొరేషన్ ఖజానాకు భారీ నష్టాన్ని కలిగించారు. భూ యజమానులతో సంబంధం లేకుండా, జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ) కూడా లేకుండా గడువు తీరిన ల్యాండ్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ ఆధారంగా టీడీఆర్ బాండ్లు జారీ చేయడం వెనుక భారీ అవినీతి అక్రమాలకు తెర తీశారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. టీడీఆర్ బాండ్లు జారీలో జరిగిన అక్రమాలపై సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో వరుస కథనాలతో ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది.

అక్రమాలు నిగ్గు తేల్చిన విజిలెన్స్

కర్నూలు నగరపాలక సంస్థలో జరిగిన టీడీఆర్ బాండ్ల జారీలో జరిగిన అక్రమాలు నిగ్గు తేల్చేందుకు రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి, ఎస్పీ కె.చౌడేశ్వరి ఆధ్వర్యంలో విచారణకు సిద్ధమయ్యారు. ఇప్పటికే జారీ చేసిన బాండ్ల సమగ్ర వివరాలు సేకరించారు. బాండ్లు జారీ చేసిన ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బాండ్ జారీ చేసిన విలువ ఎంత..? ఆ సమయంలో సబ్ రిజిస్ట్రార్ విలువ ఎంత ఉంది..? ఇలా అన్ని రికార్డులను విశ్లేషించారు. అక్రమాలు జరిగాయని గుర్తించారు. అందుకు సంబంధించిన వివరణ ఇవ్వాలని విజిలెన్స్ ఎస్పీ చౌడేశ్వరి లేఖ రాయడంతో కలకలం రేగింది. నిబంధనలు ప్రకారం రోడ్ల విస్తరణలో కోల్పోయే స్థలానికి.. రోడ్డు విస్తరణంలో 100 చదరపు మీటర్లు స్థలం కోల్పోతే 400 చదరపు మీటర్లు, ఎన్విరాన్‌మెంట్ బఫర్ జోన్‌లో 100 చదరపు మీటర్లకు 200 చదరపు మీటర్లకు టీడీఆర్ బాండ్లు జారీ చేస్తారు. కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో వైసీపీ హయాంలో 135 బాండ్లు జారీ చేశారని, వాటి విలువ రూ.వంద కోట్లకు పైగా ఉంటుందని అంటున్నారు. పలు బాండ్లు జారీలో కొందరు వ్యక్తులకు లబ్ధి చేకూరేలా దురుద్దేశపూర్వకంగా బాండ్లు జారీ చేసినట్లు గుర్తించారు. అంటే వీటి జారీలో అక్రమాలు జరిగాయనే వాస్తవాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. విజిలెన్స్ అధికారులు ఎలాంటి నివేదిక ఇస్తారు..? ఇబ్బందులు తప్పవా..? అంటూ గత ప్రభుత్వంలో టౌన్ ప్లానింగ్ విభాగంలో పని చేసి బదిలీపై ఇతర మున్సిపాలిటీలకు వెళ్లిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది గుండెల్లో గుబులు మొదలైంది.

మిగతా 6లో..

పేదల చదువుకు సహకారం

తుగ్గలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):

బంగారు నిక్షేపాలు వెలికి తీసే జియో మైసూరు కంపెనీ విద్యాభివృద్ధికి కృషి చేస్తోంది. పేద విద్యార్థులకు పలు సౌకర్యాలు కల్పిస్తూ వారికి అండగా నిలుస్తోంది. విద్యార్థులకు వాహనం, డైనింగ్ హాలు, స్టడీ మెటీరియల్, కంప్యూటర్లు సమకూర్చింది. బోధనకు తగినట్టుగా ఉపాధ్యాయులను నియమించింది. ఇలా పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తోంది. అంతేగాకుండా ఆపదలో ఉన్న వారిని రక్షించడం కోసం అంబులెన్సు సౌకర్యం ఏర్పాటు చేసింది. కంపెనీ చుట్టూ ఉన్న పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతోంది.



పగిడిరాయి పాఠశాలలో విద్యార్థులకు స్టడీ మెటారియల్ అందిస్తున్న దృశ్యం

- విద్యార్థులకు వాహనం సౌకర్యం
- కంప్యూటర్లు, స్టడీ మెటీరియల్ అందజేత
- విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న జియో మైసూరు కంపెనీ

1994 నుంచి బంగారు నిక్షేపాల కోసం అన్వేషణ

జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా జీఎస్ఐ 1994లోనే మండలంలోని జొన్నగిరి, పగిడిరాయి గ్రామాల మధ్య బంగారు నిక్షేపాలు ఉన్నాయని గుర్తించింది. అప్పట్లోనే విదేశీ పెట్టుబడుల కోసం కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించింది. 2005లో జియో మైసూరు కంపెనీ దరఖాస్తు చేస్తే 2013లో అన్ని రకాల అనుమతులు వచ్చాయి. 2014 నుంచి బంగారు నిక్షేపాల తవ్వకాల కోసం ఏర్పాట్లు చేయడంతోపాటు 1750 ఎకరాల్లో మొదటగా లీజుకు తీసుకొని ఏడాదికి ఎకరాకు రూ.16,500 చెల్లిస్తూ వస్తోంది. అందులోనే 250 ఎకరాల్లో కొనుగోలు చేసి పైలట్ ప్రాజెక్టుతోపాటు ప్రాసెసింగ్ యూనిట్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టారు.



ప్రజా సేవలో కంపెనీ ముందుంటుంది



బంగారు నిక్షేపాలతో పాటు ప్రజా సేవ చేయడం కూడా బాధ్యతగా తీసుకున్నాం. ఇప్పటికే కంపెనీ చుట్టూ ఉన్న పలు గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేపడుతున్నాం. ముఖ్యంగా విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి ముందుంటాం. ప్రతి ఒక్కరూ సహకరిస్తే కంపెనీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతాం. - మానస రంజన్ బిశ్వాల్, జియో మైసూరు కంపెనీ డైరెక్టర్

విద్యార్థులకు వాహన సౌకర్యం



విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వాహనం

జియో మైసూరు కంపెనీ స్థాపించినప్పటి నుంచి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులోభాగంగానే విద్యార్థులకు వాహనాలు లేక నడిచివస్తున్నారనే ఉద్దేశంతో మొదటగా ఆటో ఏర్పాటు చేసింది. రెండు నెలల నుంచి ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసి దాదాపు 70 మంది విద్యార్థులను చెన్నంపల్లి, పగిడిరాయి గ్రామాలకు తరలిస్తోంది. పగిడిరాయి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు కొంప్యూటర్లు అందించింది. కంప్యూటర్, హిందీ ఉపాధ్యాయులను ఏర్పాటు చేసి విద్యను అందించడంతో పాటు ఏటా 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటిరీయల్స్ అందిస్తోంది. విద్యార్థులు చెట్ల కిందే కూర్చొని భోజనం చేస్తున్నారని తెలుసుకొని జడ్పీహెచ్ఎస్‌లో జియో మైసూరు కంపెనీ వారు డైనింగ్ హాల్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులందరూ ఆ డైనింగ్ హాలులోనే కూర్చుని భోజనం చేస్తున్నారు. అలాగే తాగునీటి వసతి కూడా కల్పించారు.

ఆపదలో ఉన్నవారికి అంబులెన్సు

పగిడిరాయి కొత్తూరు, బొండ్లవాని పల్లె, జొన్నగిరి, ఉప్పర్లపల్లి, ఎర్రగుడి తదితర గ్రామాల పరిధిలో ఎవరికైనా ఆరోగ్యం బాగ లేకపోయినా, ప్రమాదాలు జరిగితే వారిని సురక్షితంగా వైద్యశాలకు తరలించడం కోసం జియో మైసూరు కంపెనీ అంబులెన్సు సౌకర్యం కల్పించింది. దీంతో 108 వాహనం రావడం ఆలస్యమైనా జియో మైసూరు కంపెనీ అంబులెన్సులో రోగులను, క్షతగాత్రులకు ఆసుపత్రులకు తరలిస్తున్నారు.



అంబులెన్సు

పేదలకు ఉచిత వైద్యం, రక్తదానం

ఈ ప్రాంతంలో ఉన్న ప్రజలకు అన్ని రకాల వైద్య చికిత్సలు చేయిస్తున్నారు. ప్రతి ఆరు నెలలకోసారి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతోపాటు జియో మైసూరు కంపెనీ వారు రక్తదానం చేస్తున్నారు. అన్ని వైద్య పరీక్షలు చేయించడంతోపాటు ఉచిత మందులు కూడా సరఫరా చేస్తున్నారు. పగిడిరాయిలో ఉన్న ప్రభుత్వ వైద్యశాలకు రోగులు, వైద్య సిబ్బందికి సురక్షిత నీరు అందించేందుకు వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశారు. అలాగే రోగులకు వైద్య చికిత్సలు చేసే సమయంలో విద్యుత్ అంతరాయం కలగకుండా ఇన్వర్టర్‌ను కూడా అందించారు.



జియో మైసూరు కంపెనీ ఏర్పాటు చేసిన వైద్యశిబిరం

జియో మైసూరు కంపెనీ సహకారంతో పాఠశాల అభివృద్ధి



జియో మైసూరు సంస్థ సహకారంతో విద్యార్థులకు అన్ని వసతులు సమకూరుతున్నాయి. అలాగే విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నారు. పాఠశాలకు వారు అందించే సేవలు అభినందనీయం.
- సౌజన్య, ఉపాధ్యాయురాలు, జడ్పీహెచ్ఎస్, పగిడిరాయి

ఎనిమిది కి.మీ. నడిచి వెళ్లాలి



జియో మైసూరు కంపెనీ వాహనం కల్పించక ముందు దాదాపు ఎనిమిది కి.మీ. నడిచి వెళ్లాలి. లేదంటే సైకిళ్లపై, ఏదైనా వాహనాలను లిఫ్ట అడిగి స్కూల్‌కు వెళ్లే వాళ్లం. జియో మైసూరు కంపెనీ వాహనం ఏర్పాటు చేసినప్పటికీ నుంచి ప్రార్థన సమయానికి పాఠశాలకు వెళ్తున్నాం.
- గీత, విద్యార్థి చెన్నంపల్లి

టీడీఆర్ బాండ్లపై విజిలెన్స్ పంజా..!

(5వ పేజీ తరువాయి)

'విజిలెన్స్' గుర్తించిన లోపాలు

- షేక్ రసూల్ అనే వ్యక్తికి సర్వే నంబరు 340/1లో టీడీఆర్ బాండ్ నంబరు.1016/00079/టీడీఆర్/ఎన్‌టీఆర్ఎన్/2022 కింద 445.92 చదరపు మీటర్లు టీడీఆర్ బాండ్ ఇచ్చారు. ఆ ప్రాంతంలో చదరపు మీటరకు మార్కెట్ విలువ ఎంత ఉందో టీడీఆర్ బాండుదారుడు నమోదు చేయలేదు. సబ్ రిజిస్ట్రార్ రికార్డులు పరిశీలిస్తే.. చదరపు మీటర్లు రూ.600 ఉంది. ఆ బాండ్ అమ్మే సమయంలో బాండుదారుడు సమర్పించిన సర్టిఫికెట్ ప్రకారం రూ.18,000 చూపారు. అయితే 2023 జూన్1న చదరపు అడుగు రూ.8,000, 1/8/2019 నుంచి 9/8/2023 మధ్య రూ.5,800, 10/8/2020 నుంచి 31/5/2923 మధ్య రూ.6,000 ఉన్నట్లు గుర్తించారు. అంటే మార్కెట్ విలువ కంటే రూ.12,000 పెంచి జారీ చేసినట్లు గుర్తించారు.
- గోరంట్లవెంకటరమణాశెట్టి అనే వ్యక్తికి సర్వే నంబరు 421/1లో కల్లూరు వార్డు 51/1-1ఏ-4 వద్ద టీడీఆర్ బాండ్ నం.1016/00015/టీడీఆర్/ఎన్‌టీఆర్ఎన్/2021 కింద 397.12 చదరపు మీటర్లు టీడీఆర్ బాండ్ ఇచ్చారు. గిఫ్ట్‌డీడ్‌లో మార్కెట్ విలువ నమోదు చేయలేదు. ఈ స్థలం కల్లూరులో సర్వే నంబరు.421/1, 77 వార్డు పాత శ్రీనివాస్ థియేటర్ వద్ద ఉంది. సేల్‌డీడ్‌లో కల్లూరు 75 వార్డు చూపారు. ఇది ఎలా సాధ్యం. ఈ బాండు అమ్మిన సమయంలో మార్కెట్ విలువ రూ.20 వేలు చూపారు. సబ్ రిజిస్ట్రార్ రికార్డులు పరిశీలిస్తే.. 2023 జూన్1న చదరపు అడుగు రూ.7వేలు, 1/8/2019 నుంచి 9/8/2023 మధ్య రూ.6,600లు, 10/8/2020 నుంచి 31/5/2923 మధ్య రూ.వేలు ఉన్నట్లు గుర్తించారు. అంటే మార్కెట్ విలువ కంటే రూ.13,000 పెంచడమే కాకుండా ఈ స్థలం 75వ వార్డులో ఉన్నట్లు గుర్తించారు.
- షేక్ రసూల్ అనే వ్యక్తికి వార్డు నంబరు.76 పరిధిలో సర్వే నంబరు.134, 158లో టీడీఆర్ బాండ్ నంబరు.1016/00032/టీడీఆర్/ఎన్‌టీఆర్ఎన్/2021 కింద 1,839.44 చదరపు మీటర్లు టీడీఆర్ బాండ్ ఇచ్చారు. బాండుదారులు మార్కెట్ విలువ సర్టిఫికెట్ సమర్పించలేదు. గిఫ్ట్‌డీడ్‌లో చదరపు అడుగు రూ.18,000 ఉంది. 76వార్డు, రాజశేఖర్ నగర్, బళ్లారి రోడ్డు అని చూపారు. అయితే సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ రికార్డు ప్రకారం ఇందిరా నగరంలో సర్వే నంబరు.134, 158లో చదరపు అడుగు 2,921 జూన్ 9 నాడు రూ.6 వేలు ఉంది. ఈ బాండులో కూడా రూ.12 వేలు మార్కెట్ విలువ పెంచినట్లు గుర్తించారు.
- కర్నూలు కార్పొరేషన్ పరిధిలో పలువురికి టీడీఆర్ బాండ్లు జారీ చేస్తే.. వారిలో మెజార్టీగా బాండ్లు అమ్ముకున్నారు. బాండ్లు అమ్మే సమయంలో సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ జారీ చేసిన మార్కెట్ విలువ సర్టిఫికెట్లు బాండుదారులు అప్‌లోడ్ చేయలేదని, అలాంటి వారు 30 మందికి పైగా ఉన్నారు. ఆ సమయంలో మార్కెట్ విలువ వివరాలు ఇవ్వాలంటూ విజిలెన్స్ అధికారులు కమిషనర్‌కు లేఖ రాశారు.



కర్నూలు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జారీ చేసిన టీడీఆర్ బాండ్ల జారీలో అక్రమాలపై సెప్టెంబరు 27న ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనం



సెప్టెంబరు 28న ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనం

బాండ్లు జారీ చేయడం ఒక్కటే మా బాధ్యత

టీడీఆర్ బాండ్లు జారీ చేయడం ఒక్కటే మా బాధ్యత. మాస్టర్ ప్లాన్ రోడ్డులో స్థలాలు కోల్పోయేవారు కార్పొరేషన్‌కు అప్పగిస్తే రోడ్డు విస్తరణలో నాలుగు వంతులు, బఫర్‌జోన్‌లో అయితే ఇచ్చిన స్థలానికి రెండింతల టీడీఆర్ బాండ్లు ఇస్తాం. మార్కెట్ విలువ మాకు సబంధం లేదు. అది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చూసుకుంటుంది. విజిలెన్స్ అధికారులు పంపిన లేఖకు సమాధానం ఇస్తాం. ఇప్పటి వరకు ఎలాంటి లేఖ మాకు రాలేదు.
- ప్రదీప్‌కుమార్, సిటీ ప్లానర్, కర్నూలు నగర పాలక సంస్థ

సకల శాస్త్రాల సారాంశమే భగవద్గీత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

నంద్యాల కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత సకల శాస్త్రాల సారాంశమని తిరుమల తిరుపతి దేవస్థానాల హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లాల కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. సోమవారం నంద్యాల శ్రీకృష్ణమందిరంలో టీడీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ మందిర అధ్యక్షుడు పార్థసారథి క్రిష్ణ, విజయచంద్రుడు నిర్వహణలో భగవద్గీత శ్లోక కంఠస్థ పఠన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా 6-9 తరగతులలో సుస్మిత, చతురశ్రీ, హనీష, 8-9 తరగతుల విభాగంలో సూర్య ధరణి, తరుణ్, షణ్ముఖేశ్వరి అందుకున్నారు. న్యాయనిర్ణేతలుగా పార్వతి, డాక్టర్ దేవి, దయానంద్‌సింగ్, భానోజీరావు, శిరీష, సంగీత, అపర్ణదీపిక, పుష్పలత, సత్యారెడ్డి వ్యవహరించారు.

పల్లకిలో విహరించిన ఆది దంపతులు



పల్లకి సేవను నిర్వహిస్తున్న వేద పండితులు

మహానంది, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి ఆది దంపతులైన మహానందీశ్వరుడు, కామేశ్వరీదేవి పల్లకిలో విహరించారు. ఆలయం ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో స్వామి, అమ్మవార్ల విగ్రహాలను ప్రత్యేకంగా పూలతో అలంకరించిన పల్లకిలో ఆశీనులు గావించారు. అనంతరం భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. భక్తుల శివనామ స్మరణ మధ్య ఆలయ ప్రాంగణంలో పల్లకి సేవ ఉత్సవం మేళతాళాలతో నిర్వహించారు.

శివానికి షాట్‌పుట్‌లో బంగారం

అభినందించిన తెలంగాణ గవర్నర్



గోల్డ్ మెడల్ సాధించిన శివాని

మద్దికెర, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శివాని దివ్యాంగురాలు. చిన్నతనంలో కుడిచేయి పోయింది. అయినా ఆమె ఎక్కడా అధైర్యపడలేదు. పైగా ఈ ఏడాది అక్టోబరు 18న తల్లి అకాల మరణం చెందినా ఆత్మ విశ్వాసంతో ఆడి థాయిలాండ్‌లో జరిగిన షాట్‌పుట్‌లో బంగారు పతకం సాధించింది. మద్దికెరకు చెందిన ఉప్పర వీరప్ప, లలిత దంపతుల పెద్ద కూతురు శివాని. తండ్రి కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. శివాని ఎమ్మిగనూరు జవహర్ నవోదయ పాఠశాలకు ఎంపికైంది. క్రీడలపై మక్కువతో హైదరాబాదులోని గోపనపల్లి జవహర్ నవోదయ విద్యాలయ పాఠశాలలో చదువుతూ ఆదిత్య మెహతా పారా స్పోర్ట్స్ అకాడమీ ద్వారా కోచ్ వేణు వద్ద శిక్షణ పొందుతోంది. డిసెంబరు 1 నుంచి థాయిలాండ్‌లో 7వ తేదీ వరకు జరిగిన ఎఫ్46 అండర్-20 విభాగంలో షాట్‌పుట్‌లో గోల్డ్‌మెడల్ సాధించింది. శివాని బృందాన్ని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అవార్డు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా శివాని మాట్లాడుతూ ఈ విజయం తన అమ్మకు అంకితం అని పేర్కొంది.

ఆ ఘటన నేటికీ కళ్లముందే...

- బాటసారులకు రక్షణగా వెళ్తుండగా తీవ్రవాదుల దాడి
- మేం తేరుకునేలోగానే తూటాలకు మా ఎస్ఐ మృతి
- ఎదురు కాల్పులకు దిగి నలుగురిని కాల్చి చంపాం
- భారత్‌లోకి అడుగుపెట్టకుండా మిగతా వారిని తరిమికొట్టాం
- మా పోరాట పటిమకు గుర్తుగా పోలీస్‌మెడల్స్ ప్రకటించారు
- పత్తికొండకు చెందిన జవాన్ బొల్లం రామాంజినేయులు

పత్తికొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 'డిసెంబరు 1, 2020వ సంవత్సరం భారత్ - పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతమైన జమ్మూ కశ్మీర్‌లోని రాజోలి ప్రాంతం. రాజోలి ప్రాంతం నుంచి వేరే ప్రాంతాలకు వెళ్లే ప్రజలకు రక్షణగా మా ఎస్ఐతోపాటు మేం ఏడుగురు జవానులం ముందుకు సాగుతున్నాం. ఒక్కసారిగా తుపాకీల శబ్దం. ఏం జరుగుతుందో అర్థం చేసుకునేలోగా ముందు నడుస్తున్న మా ఎస్ఐ తుటాల ధాటికి నేలకొరిగాడు. దేశంలోకి అక్రమంగా ప్రవేశించేందుకు పాకిస్తాన్ తీవ్రవాదులు కాల్పులకు దిగనట్లు కొద్దిసేపులోనే మేం అర్థం చేసుకున్నాం. అక్రమంగా దేశంలోకి ప్రవేశించాలన్న వారి ప్రయత్నాన్ని అడ్డుకునేందుకు ఎదురు కాల్పులకు దిగాం. మేం నడుస్తున్న ప్రాంతానికి కొంచెం పై ప్రాంతంలో సుమారు 15 మంది దాకా తీవ్రవాదులు ఉన్నట్లు గుర్తించాం. వారిని దేశంలోకి అడుగుపెట్టకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా ఏడుగురం ఎదురు కాల్పులతో వారిపై విరుచుకుపడ్డాం. నలుగురు తీవ్రవాదులను కాల్చి చంపాం. మా వీరోచిత దాడికి మిగిలిన తీవ్రవాదులు అక్కడి నుంచి పారిపోయారు. మా ఎదురు కాల్పులలో చనిపోయిన తీవ్రవాదలు పాకిస్తాన్‌కు చెందిన హిజబుల్ ముజాయిద్దిన్ గ్రూపు తీవ్రవాదులుగా గుర్తించాం.

ఈ పోరులో ప్రాణాలు పోగొట్టుకున్న ఎస్ఐకి భారత ప్రభుత్వం కీర్తి చక్ర బిరుదును అందించి గౌరవించింది. మాకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము పోలీస్ పతకాన్ని ప్రకటించారు. సోమసురక్షా భల్ అంటూ జవాన్ పేరును సూచిస్తూ దేశ రక్షణ కోసం మీ వీరత్వానికి గుర్తింపుగా ఈ పోలీస్ పతకాన్ని అందిస్తున్నామని రాష్ట్రపతి సంతకంతో కూడిన ప్రశంసాపత్రంలో పేర్కొన్నారు. రాష్ట్రపతి నుంచి అందిన ప్రశంసాపత్రంతోపాటు పోలీస్ మెడల్‌ను ఆదివారం రాజస్థాన్‌లో జరిగిన బీఎస్ఎఫ్ 60వ వార్షికోత్సవ సంబరాలలో హోంమంత్రి అమిత్‌షా ఆ ఏడుగురు బీఎస్ఎఫ్ జవాన్లకు అందించారు. దేశరక్షణలో ప్రాణాలకు ఎదురొడ్డి పోలీస్‌మెడల్స్‌ను సాధించిన ఏడుగురు జవాన్లలో నేను ఒకడిని' అంటూ పత్తికొండ పట్టణానికి చెందిన బొల్లం రామాంజినేయులు తెలిపారు. ప్రస్తుతం గుజరాత్ రాష్ట్రం భూజ్ సరిహద్దు ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న రామాంజినేయులును పోలీస్‌మెడల్ అందుకున్న సందర్భంగా ఆంధ్రజ్యోతి పలకరించింది దీంతో 2020 డిసెంబరు 1న రాజోలిలో జరిగిన నాటి సంఘటన వివరాలను వెల్లడించారు.



చిన్ననాటి నుంచే సైనికుడు కావాలన్న కల

ఒంట్లో సత్తువ ఉన్నంత వరకు దేశ రక్షణ కోసం పని చేస్తా

2004లో 59వ బెటాలియన్‌లో బీఎస్ఎఫ్‌లో చేరాను. 20 ఏళ్లకు పైగా దేశ రక్షణ కోసం పని చేస్తున్నాను. మాకు 60 ఏళ్ల వరకు విధులు నిర్వర్తించే అవకాశం ఉంటుంది. 2020 డిసెంబరు 1న జరిగిన సంఘటనలో ప్రాణాలతో బయటపడతామన్న ఆలోచన కూడా మాకు లేదు. తీవ్రవాదులను తరిమికొట్టి దేశ రక్షణకు మా వంతు పని చేయాలన్న ఆలోచనే మమ్మల్ని ముందుకు నడిపించింది. హోంమంత్రి అమిత్‌షా నుంచి మెడల్ అందుకోవడం గర్వంగా ఉంది. ఒంట్లో సత్తువ ఉన్నంత వరకు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ ద్వారా సైనికుడిగా దేశరక్షణ కోసం పని చేస్తాను.
- బొల్లం రామాంజినేయులు



చిన్ననాటి నుంచే సైనికుడు కావాలని కలలు..

పత్తికొండ పట్టణం పాతపేట తేరుబజార్ ప్రాంతంలో నివసించే బొల్లం మాదన్న, గౌరమ్మల ఏకైక సంతానం బొల్లం రామాంజినేయులు. వారిది చేనేత కుటుంబం. పైచదువులకు వెళ్లే స్థోమతలేక ఇంటర్‌తో చదువు ఆపేశాడు. నెరవేర్చుకునేందుకు వివిధ ప్రాంతాలలో జరిగే మిలిటరీ సెలక్షన్‌లకు వెళ్లేవాడు. అందుకు ఖర్చుల కోసం తల్లిని ఇబ్బంది పెట్టకుండా దుకాణాలలో పని చేసేవాడు. చివరకు 2003లో చిత్తూరులో జరిగిన బీఎస్ఎఫ్ సెలెక్షన్స్‌కు ఎంపికయ్యాడు. ముందుగా బెంగళూరు ఆ తర్వాత పంజాబ్‌లో ఏడాది శిక్షణ పూర్తి చేసుకొని 2004లో త్రిపురలో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ 59వ బెటాలియన్‌లో విధుల్లో చేరాడు. జమ్మూ ప్రాంతంలోని సాంబ, కుపువాడ, శ్రీనగర్ (పంథ్‌చౌక్) రాజోలి సరిహద్దు ప్రాంతాలలో పని చేశాడు. ప్రస్తుతం గుజరాత్‌లోని భూజ్ సరిహద్దు ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నాడు.



హోంమంత్రి అమిత్‌షా నుంచి పోలీస్ మెడల్ అందుకుంటున్న రామాంజనేయులు

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నిరుద్యోగులు

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాలయాపన చేయకుండా వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం బిర్లాగేటు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి డీఎస్సీ నిరుద్యోగులు ధర్నా చేశారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, రాష్ట్ర సహాయ కార్యదర్శి శిరీష, జిల్లా కార్యదర్శి నగేష్ మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షకు ఒకే ప్రశ్నాపత్రం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వం నిరుద్యోగులను నిర్లక్ష్యం చేసిందని, ఇప్పుడు కూడా ఇలాగే జరిగితే.. ఈ ప్రభుత్వానికీ అదే గతి పడుతుందని హెచ్చరించారు. డిసెంబరు నాటికి డీఎస్సీ పరీక్షను పూర్తి చేసి ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన సీఎం ఏదో ఒక కారణం చెప్పి మరో ఆరు నెలలుగా పొడిగించడం సమంజసం కాదన్నారు. తెలంగాణ ప్రభుత్వం మాదిరిగా డీఎస్సీ నోటిఫికేషన్ షెడ్యూల్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి హుశేన్ బాషా, అబ్దుల్లా, సురేష్, సాయి, ఉదయ్, నిరుద్యోగులు ఉమర్, చంద్రశేఖర్ రెడ్డి, రాజేష్ నాయక్, చంద్రార్ధన్, డీవైఎఫ్ఐ కార్యకర్తలు నిరుద్యోగులు పాల్గొన్నారు.

గుంతలోపడి రెండు ఎద్దులు మృతి

• మహిళా రైతును కాపాడిన స్థానికులు



మృతిచెందిన ఎద్దులను బయటకు తీస్తున్న గ్రామస్తులు

పాణ్యం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుపూరు మజరా గ్రామం అహల్యాపురం సమీపంలో సోమవారం జరిగిన ప్రమాదంలో రెండు ఎద్దులు మృతి చెందాయి. ప్రమాదానికి గురైన మహిళా రైతును సమీప రైతులు కాపాడారు. తహసీల్దారు నరేంద్ర నాథ్‌రెడ్డి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పోలుగారి ప్రసాద్ భార్య రూతమ్మతో కలిసి ఎద్దుల బండిలో మద్దూరు పొలిమేరలోని పొలానికి వెళ్లారు. మిరపకు పురుగుల మందు పిచికారీ చేయడానికి ట్యాంకు నీరు నింపుకొని వస్తుండగా ప్రమాదావశాత్తు పక్కన ఉన్న రైల్వే పనుల కోసం తీసిన గుంతలో ఎద్దుల బండి పడింది. ప్రసాద్ ఈత కొట్టుకుంటూ బయటికి రాగా సమీపంలోని రైతులు రూతమ్మను రక్షించారు. ఎద్దులు నీటిలో మునిగి మృతి చెందాయి. పశుసంవర్ధక శాఖ, రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎద్దుల విలువ రూ.1.50 లక్షలు ఉన్నట్లు బాధిత రైతు ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం తనకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.

పోలీసులకు అందని సమాచారం

గ్రామంలో ఉదయం జరిగిన సంఘటన గురించి రాత్రి వరకు సమాచారం లేదని పోలీసులు పేర్కొన్నారు. రెండు ఎద్దులు ప్రమాదంలో చనిపోయినా సచివాలయ పోలీసులు గానీ, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి పోలీసులకు తెలియజేయాలన్న నిబంధనలు గాలికొదిలేశారు.

గాజులపల్లిలో ఘర్షణ

• నలుగురిపై కేసు నమోదు

మహానంది, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులపల్లిలో రస్తా విషయంలో ఘర్షణ పడిన నలుగురిపై కేసు నమోదైంది. గాజులపల్లికి చెందిన రాజగోపాల్‌తోపాటు ఆయన కొడుకుపై అదే గ్రామానికి చెందిన శేఖర్, శివసాయి, లక్ష్మీదేవి, శిరీషలు రస్తా విషయమై ఘర్షణ పడి కర్రలతో దాడి చేశారు. దీంతో రాజగోపాల్ భార్య లక్ష్మీదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

భార్యా భర్త ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న పల్లవి, భార్గవ్

బనగానపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటి క్షేత్ర సమీపంలోని పార్వతి గుడి సమీపంలో తెలంగాణకు చెందిన దంపతులు సోమవారం ఆత్మహత్యాయత్నం చేశారు. తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా ఐజకు చెందిన భార్గవ్, పల్లవి భార్యాభర్తలు. వీరు ఇద్దరు పురుగుల మందు తాగగా అటు వైపు వస్తున్న అయ్యప్ప స్వామి భక్తులు గమనించి 108 వాహన సిబ్బందికి సమాచారం అందించారు. 108 సిబ్బంది ఇద్దరిని వాహనంలో బనగానపల్లె ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. డాక్టర్లు ఇక్కడ వైద్య చికిత్స చేసి నంద్యాల వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ చేపట్టారు. మతిస్థిమితం లేని భార్గవ్ ప్రోద్బలంతోనే ఇరువురు పురుగుల మందు తాగినట్లు కుటుంబ సభ్యుల ద్వారా తెలుస్తోంది.

నిత్యం అందుబాటులో ఉంటా

• రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్



ప్రమాణ స్వీకారం చేస్తున్న మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్

నంద్యాల కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ముస్లింల అభివృద్ధి కోసం నిత్యం అందుబాటులో ఉంటానని ఏపీ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ అన్నారు. సోమవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ షరీఫ్, విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే నక్క ఆనంద్‌బాబు, తెలుగుదేశం పార్టీ నాయకుల సమక్షంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆ సందర్భంగా మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ తన కష్టాన్ని గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ పదవి ఇచ్చారని ధన్యవాదాలు తెలిపారు.

ప్రగతి పథంలో నడిచేనా..!

కూటమి ప్రభుత్వంలో మొదటి డీఆర్సీ సమావేశం

గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా పడకేసిన అభివృద్ధి

సరైన నిర్ణయాలతో జిల్లాకు మేలు చేయాలని ఆశిస్తున్న ప్రజలు



నంద్యాల కలెక్టర్ కార్యాలయం

సాగు నీటి ప్రాజెక్టులకు..

అధికారంలోనికి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు పెద్దగా నిధులు కేటాయించలేదు. ఈ అభివృద్ధి సమావేశంలో సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేకంగా చర్చించి తగు నిర్ణయాలు తీసుకుంటే బాగుటుంది.

నంద్యాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాలో మొదటిసారి డీఆర్‌సీ సమావేశం మంగళవారం జరగబోతోంది. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, ఆర్థిక శాఖ మంత్రి రానున్నారు. అభివృద్ధి చెందేందుకు అన్ని అవకాశాలు నంద్యాల జిల్లాకు ఉన్నా, గత వైసీపీ పాలన వల్ల అనుకున్న స్థాయిలో ప్రగతి పథంలో నడవలేదు. ఈ నేపథ్యంలో మంగళ వారం జరగబోయే డీఆర్సీ సమావేశం ప్రత్యేకతను సంతరించుకుంది. కూటమి నేతలు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునేదీ లేనిదీ స్పష్టం కానుంది.

రైతులకు ఏం హామీలు ఇస్తారో చూడాలి..

ఇటీవలే తుఫాను ధాటికి జిల్లాలో చాలాచోట్ల పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారు. వారిని ఆదుకునేలా ఈ సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి. భూసార పరీక్షలు, భూసార కార్డుల పంపిణీ, పరీక్ష ప్రయోగశాలల వంటి వాటికి నిధులు కేటాయించాలని రైతులు కోరుతున్నారు.

యాంత్రీకరణకు ఊతం..

గత ప్రభుత్వంలో యాంత్రీకరణ పథకం లబ్ధిని వైసీపీ నేతలే అనుభవించారు. ట్రాక్టరు వంటి ముఖ్యమైన వాటిని వైసీపీ నేతలు ఇళ్లలోనే పెట్టుకుని సొంతానికి వాడుకున్నారు. కూటమి పాలనలో రైతుకు పూర్తి మేలు చేసేలా డీఆర్‌సీ సమావేశం నిర్ణయం తీసుకుంటుందా? చూడాలి.

రోడ్లు బాగుపడతాయా?

నంద్యాల జిల్లాలో దాదాపు 3300 కి.మీ ఆర్‌అండ్‌బీ రోడ్లు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం మొన్నటి బడ్జెట్‌లో దాదాపు ఆర్‌అండ్‌బీ శాఖకు రూ.9554 కోట్లు కేటాయించింది. కూటమి ప్రభు త్వంలో రోడ్ల గురించి డీఆర్‌సీ సమావేశంలో కీలక నిర్ణయం జరగాల్సి ఉన్నది.

పంచాయతీలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారా?

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇప్పటికే గ్రామ సభలను నిర్వహించి గ్రామాల్లో సిమెంటు రోడ్ల పనులు ప్రారంభించారు. ప్రస్తుత బడ్జెట్‌లో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధికి దాదాపు 16,739 కోట్లు కేటాయించింది. ఈ క్రమంలో డీఆర్‌సీ సమావేశంలో తీసుకోబోయే నిర్ణయాలకు ప్రాధాన్యముంది.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమం కోసం..

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టేల్సి ఉంది. మంగళవారం జరిగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సమావేశంలో ఆయా నియోజక వర్గాల ప్రజాప్రతినిధులు నిర్ణయాలు తీసుకుంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు మేలు జరుగుతుంది.

కునారిల్లుతున్న తాగునీటి పథకాలు..

జలజీవన్ మిషన్ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాల్సిన నిధులు కేటాయించలేదు. దీంతో ఈ పథకం ఇంకా నత్తనడకన నడుస్తోంది. దీనిపైన ప్రజాప్రతినిధులు శ్రద్ధ వహించి ప్రజలకు మంచి నీరు అందించేందుకు నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నేడు ఇన్‌చార్జి మంత్రి పయ్యావుల కేశవ్ రాక..!

• డీఆర్సీ సమావేశంలో పాల్గొననున్న మంత్రి



పయ్యావుల కేశవ్

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాలో మంగళవారం మొదటి డీఆర్సీ సమావేశం జరగునుంది. రాష్ట్ర ఆర్థిక శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పయ్యావుల కేశవ్ రానున్నారు. సమావేశానికి ముందు జిల్లా టీడీపీ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు జిల్లా ప్రజాప్రతినిధులతో సమావేశం కానున్నట్లు తెలుస్తోంది.

రైతులతోనే విత్తనోత్పత్తి చేయించండి

• బకాయిలు విడుదల చేయిస్తా • ఏపీ సీడ్స్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి



శనగ విత్తనాలను పరిశీలిస్తున్న చైర్మన్

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాసి రకం విత్తనాలను కొని పంట దిగుబడులు రాక రైతులు నష్టపోతున్నారని, ఇటువంటి పరిస్థితి భవిష్యత్తులో రాకుండా ఏపీ సీడ్స్ సంస్థ ద్వారా రైతులతోనే నాణ్యమైన విత్తనాలు ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం నగరంలోని ఏపీ సీడ్స్ సంస్థ కార్యాలయాన్ని చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏపీ సీడ్స్ సంస్థ ద్వారా రైతులకు అందిస్తున్న విత్తనాలను ఆయన పరిశీలించారు. ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ ధనలక్ష్మి సంస్థ ద్వారా ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో అందిస్తున్న విత్తనాలు, తదితర అంశాలపై చైర్మన్‌కు వివరాలు అందించారు. ఇకపై ఉమ్మడి జిల్లాల రైతులు వ్యాపారులు, దళారులపై ఆధారపడురాదని, ప్రభుత్వం నుంచి పూర్తి సహకారాన్ని అందేలా చూస్తానన్నారు. శనగ రైతులకు అందాల్సిన బకాయిలు రూ.2 కోట్లు వెంటనే విడుదల చేయిస్తానని హామీ ఇచ్చారు. ఒకప్పుడు ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు కర్నూలు ఏపీ సీడ్స్ నుంచి నాణ్యమైన విత్తనాలను రైతులకు అందేవని, వివిధ రకాల విత్తనాలను రైతులతోనే ఉత్పత్తి చేయించి తక్కువ ధరకు అందించే వాళ్లని అన్నారు. మళ్లీ ఆ పరిస్థితిని తెచ్చేందుకు సంస్థ అధికారులు పని చేయాలని, ఈ విషయంలో అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. సిబ్బంది రెహిమాన్, తదితరులు ఉన్నారు.

నందికొట్కూరు ఘటన బాధాకరం

• మంత్రి బీసీ



బనగానపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరులో ఇంటర్ విద్యార్థినిపై పెట్రోలు పోసి హత్య చేయడం అత్యంత బాధాకరమని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సోమవారం విచారం వ్యక్తం చేశారు. ఎస్పీ ధికారజ్ సింగ్ రాణాతో ఫోన్‌లో మంత్రి బీసీ మాట్లాడి ఘటనా విరాలను తెలుసుకున్నారు. ఇది దురదృష్టకరమని, ఇలాటి ఘటనలు పునరావృతం కాకుండా కళాశాలల వద్ద నిఘా పెంచాలని ఎస్పీని కోరారు.

అమ్మఒడి పేరిట బురిడీ

• ఖాతాల్లో నగదు కాజేసిన సైబర్ కేటుగాళ్లు



బాధితుడు నాగరాజు



బాధితుడు ఆనంద్

ఆలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అమ్మఒడి పేరుతో సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారు. ఖాతాలో ఉన్న డబ్బులను పక్కా ప్రణాళికలతో కాజేశారు. అరికెర గ్రామానికి చెందిన నాగరాజు, మల్లికార్జున బతుకుదెరువు కోసం తెలంగాణ వలస వెళ్లారు. నాగరాజుకు ఆదివారం మధ్యాహ్నం ఓ వ్యక్తి కాల్ చేశాడు. అమరావతి నుంచి మాట్లాడుతున్నానని చెప్పాడు. 'అనంతరం మీ వలంటీర్ ఎవరు అని అడిగాడు. మీకు అమ్మ ఒడి వచ్చిందా అని ప్రశ్నించాడు. రాలేదని సమాధానం ఇవ్వడంతో మీ వలంటీర్ ఆనంద్‌ను లైన్‌లోకి తీసుకుంటానని చెప్పి కాన్ఫరెన్స్ కాల్ చేశాడు. ఆనంద్ నేను అమరావతి నుంచి మాట్లాడుతున్నా.. వీళ్లకు అమ్మఒడి ఎందుకు రాలేదని ప్రశ్నించాడు. అనంతరం వీడియో కాల్ చేసి రాజముద్ర గుర్తు చూపించాడు. అనంతరం వారి ఫోన్‌కు వచ్చిన ఓటీపీ నెంబర్ తెలుసుకొని రూ.12,500 లాగేశాడు. అలాగే మల్లికార్జున అనే వ్యక్తి నుంచి రూ.9 వేలు, వలంటీర్ ఆనంద్ నుంచి రూ.5 వేలు చాకచక్యంగా కొట్టేశాడు. వాళ్ల ఫోన్ నుంచే ఉదిత్ శర్మ అనే వ్యక్తికి అమౌంట్ ట్రాన్స్‌ఫర్ అయినట్టు ఫోన్‌పేలో చూపించింది. చివరకు మోసపోయామని తెలుసుకున్న బాధితులు లబోదిబోమంటూ జరిగిన విషయాన్ని గ్రామస్థులకు తెలియజేశారు.

ఈ హాస్టల్ వార్డెన్ మాకొద్దు

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తమను వేధిస్తున్న హాస్టల్ వార్డెన్ తమకొద్దని పట్టణ శివారు ప్రాంతంలోని ఎస్సీ కళాశాల హాస్టల్ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. సోమవారం హాస్టల్ నుంచి ర్యాలీగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి ముట్టడించారు. మెనూ పాటించకుండా హాస్టల్ వార్డెన్ తమను ఇబ్బందులు గురి చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. వంద మంది విద్యార్థులకు రెండు మూడు కేజీల కూరగాయలు తెచ్చి వాటిని సర్దుతున్నారని వాపోయారు. హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకుందని పలుమారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. హాస్టల్ వార్డెన్ కర్నూలులో ఉంటూ ఎప్పుడో ఒకసారి వస్తున్నాడని, శివారు ప్రాంతంలో శిథిలావస్థ భవనంలో బిక్కుబిక్కుమంటూ ఉంటున్నామన్నారు. అధికారులు హాస్టల్‌ను సందర్శించాలని డిమాండ్ చేశారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. దీంతో విచారణ చేపడతామని ఆయన హామీ ఇచ్చారు.

చిన్న కోతతో గుండె ఆపరేషన్

• విజయవంతంగా నిర్వహించిన డా. ప్రభాకర్ రెడ్డి



కోలుకుంటున్న బాలుడు



డా.సి.ప్రభాకర్ రెడ్డి

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా పాములపాడు మండలం మిట్టకందాల గ్రామానికి చెందిన 13 ఏళ్ల ఖాజా బాషాకు గుండెకు రంధ్రం పడింది. ఈ కేసును నంద్యాల కార్డియాలజీ వైద్యులు కర్నూలు జీజీహెచ్‌కు రెఫర్ చేశారు. ఈ నెల 5వ తేదీ కార్డియోథొరాసిక్ విభాగానికి తల్లిదండ్రులు బాలుడ్ని తీసుకువచ్చారు. సిటీ సర్జరీ హెచ్‌వోడీ డా.సి.ప్రభాకర్ రెడ్డి బాలునికి పరీక్షలు నిర్వహించి ఎదిగే వయస్సు కాబట్టి మినిమిల్లీ ఇన్వాసివ్ హార్ట్ బైపాస్ సర్జరీ (ఎంఐసీఎస్) చేయాలని నిర్ణయించారు. సోమవారం డా.సి. ప్రభాకర్ రెడ్డి నేతృత్వంలో బాలునికి మూడున్నర గంటలు శ్రమించి చిన్న కోతతో గుండె ఆపరేషన్ (ఎంఐసీఎస్)ను విజయవంతంగా నిర్వహించారు. గత వారం రోజుల క్రితం హైదరాబాదు షెరటాన్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంఐసీఎస్, రోబోటిక్ ఆపరేషన్‌లో మెలకువలతో ఎంసీఎస్ ఆపరేషన్‌ను డా. ప్రభాకర్ రెడ్డి నిర్వహించారు. బాలునికి గుండెలో హోల్ ఉంది.. అందువల్ల బోన్ కూడా కట్ చేయాల్సి వస్తుంది. కానీ సోమవారం చిన్న కోత ఆపరేషన్ చేసినందు వల్ల ఎముక కట్ చేసే పని ఉండదు. ఇలాంటి ఎంఐసీఎస్ ఆపరేషన్లు కర్నూలు జీజీహెచ్‌లో 60 దాకా చేసినట్లు సీనియర్ సిటీ సర్జన్ డా.సి. ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ ఆపరేషన్‌లో కార్డియోథొరాసిక్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.రవీంద్ర, అనస్థీషియా సీనియర్ ప్రొఫెసర్ డా.కొండారెడ్డి, పెర్ఫ్యూజనిస్టు రమేష్, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్పకు విళక్కి పూజ



ఆయుధ పూజలో పాల్గొన్న టీడీపీ నాయకులు, అయ్యప్ప స్వాములు

నంద్యాల కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నంద్యాల అయ్యప్ప సేవాసమాజం ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి దేవాలయంలో సోమవారం అయ్యప్పస్వామి వారికి మండల విళక్కి పూజ నిర్వహించారు. ఉదయం కన్నెస్వాములచే చెరువుకట్ట వద్దకు వెళ్లి కేరళ సింగారి మేళ వాయిద్యాలతో కలశయాత్ర నిర్వహించి, ఉత్సవ విగ్రహానికి జలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ నాయకులు ఎన్ఎండీ ఫయాజ్, రామచంద్రారావు పాల్గొని ఆయుధపూజ, మూలవిరాట్‌కు పుష్పాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి అష్టాదశకలశాన్విత పడిపూజ మహోత్సవం ఊంజల సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

పటిష్ట చర్యలతో కుష్టు, క్షయ నివారణ



గర్భిణులను పరీక్షిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో

గడివేముల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పటిష్ట చర్యలతో కుష్టు, క్షయవ్యాధులను నివారించవచ్చని జిల్లా అదనపు వైద్యశాఖ అధికారి, క్షయ, కుష్టు నివారణ అధికారి డాక్టర్ శారద అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కుష్టు, క్షయ సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులు ప్రణాళికాబద్ధంగా, క్రమం తప్పకుండా మందులు వేసుకొని పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధులు నివారించవచ్చని అన్నారు. కుష్టువ్యాధికి తొలిదశలోనే చికిత్స చేయడం ద్వార వ్యాధిని నివారించవచ్చని అన్నారు. వైద్యశాఖ సిబ్బంది ఇంటింటికి వెళ్లి క్షయ, కుష్టు వ్యాధులపై అవగాహన కల్పించాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ పథకంలో భాగంగా గర్భిణీలకు పరీక్షలు నిర్వహించారు. రక్తహీనతకు గురి కాకుండా పౌష్టికాహారం తీసుకోవాలని గర్భిణీలకు సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు కిరణ్‌కుమార్, రంజితాకుమారి, పీహెచ్ఎన్ సర్వేశ్వరమ్మ, వైద్యశాఖ సిబ్బంది రాజ్‌కుమార్, కొత్తూరమ్మ, విజయ్‌కుమార్, సుగుణవాణి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల అనర్హతపై అధికారుల జల్లెడ



పింఛన్‌దారుల వివరాలు పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి

నంద్యాల రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు అనర్హత పింఛన్ల గుర్తింపు కోసం ప్రత్యేక బృందాలు జల్లెడపట్టాయి. అనర్హత పింఛన్ల గుర్తింపు కోసం ప్రభుత్వం నంద్యాల జిల్లాలో నంద్యాల మండలంలోని కానాల గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసింది. ఈక్రమంలోనే డీఆర్‌డీఏ పీడీ శ్రీదర్‌రెడ్డి, డిప్యూటి సీఇవో సుబ్బారెడ్డి, డీఎల్‌డీవో శివారెడ్డిల పర్యవేక్షణలో కానాల గ్రామంలో అనర్హత పింఛన్ల గుర్తింపుకోసం పది బృందాలు గ్రామంలో పర్యటించాయి. ఐదుగురు ఎంపీడీవోలు, ఐదుగురు ఈవోఆర్డీలు, పది మంది వెల్ఫేర్ అసిస్టెంట్‌లు గ్రామంలోని ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వం నిర్దేశించిన విధివిధానాల ప్రకారం 420 మంది పింఛన్ల లబ్ధిదారుల వివరాలు పరిశీలించారు. ఇంకా కొంత మంది పింఛనుదారుల గ్రామంలో లేకపోవడంలో పూర్తిస్థాయిలో సమాచారం అధికారులకు అందలేదు.

అదానీ కుంభకోణంపై విచారణ జరపాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

గోస్పాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశంలో అదానీ గ్రూప్ కంపెనీల విద్యుత్ ఒప్పందాలపై జరిగిన కుంభకోణాలను వెలికి తీసి విచారణ చేపట్టాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వం కార్పోరేట్ సంస్థ అయిన అదానీ గ్రూప్‌కు దేశ సంపదను అప్పనంగా ఇస్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ఇరవైఐదు సంవత్సరాలు విద్యుత్ పెంపుదలకు అంగీకరించిదన్నారు. గ్రామాల్లో ఇళ్లకు బిగుస్తున్న స్మార్ట్ విద్యుత్ మీటర్లను అడ్డుకొని తీరుతామన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే జరిగిన కుంభకోణాలు వెలికి తీసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ షేక్ మెహిద్దీన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి హరినాథ్, సహాయ కార్యదర్శి జిలాని, మౌలా పాల్గొన్నారు.

పశువైద్యశాలలో మురుగు

నందికొట్కూరు రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 10 బొల్లవరం గ్రామం పశువైద్యశాల చుట్టూ లో మురుగునీరు ఆవరించింది. పశువులను వైద్యం కోసం తీసుకుని వెళ్లాలంటే మురుగును దాటాల్సిందే. మురుగు వల్ల దోమలు, దుర్వాసన వెదజల్లుతోందని రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు గ్రామంలో కేజీ రహదారి పక్కన గ్రామ పంచాయతీ వారు ఏర్పాటు చేసిన జేఎల్ఆర్ మంచినీటి ట్యాంక్ ఉంది. ట్యాంక్ చుట్టూ మురుగనీరు చేరడంతో తాగునీరు కలుషితమవుతోంది. మురుగునీటిని తొలగించాలని అనేక సార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధిధికారులు మురుగును తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



విద్యార్థినులపై దాడులను అరికట్టాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్ నాయక్

నందికొట్కూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరులో ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థినీపై పెట్రోల్ పోసి హత్య చేసిన నిందితుడిని విచారించి చట్ట ప్రకారం శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఆర్ నాయక్ డిమాండ్ చేశారు. నందికొట్కూరు పట్టణంలోని బైరెడ్డి నగర్‌కు చెందిన లహరి మృతిని ఖండిస్తూ ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ జనియర్ కళాశాల ఎదుట నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ దేశంలో విద్యార్థులకు మహిళలకు రక్షణ కరువైందని మొన్న ముచ్చుమర్రి ఘటన, నిన్న చాగలమర్రి సంఘటన మరవక ముందే నేడు విద్యార్థిని ఇంట్లోకి వెళ్లి అతి క్రూరంగా పెట్రోల్ పోసి దహనం చేసిన సంఘటన నెలకొనడం బాధాకరమన్నారు. విద్యార్థినులను విద్యాలయాలకు పంపేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారన్నారు. లహరి హత్య కేసులో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ నందికొట్కూరు మండల కార్యదర్శి హరివర్ధన్, సందీప్, శేషాద్రి, శివ తేజ, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

●లహరి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని ఏఐఎస్ఎఫ్, సీపీఐ నాయకులు పట్టణంలో ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. సీపీఐ నాయకులు రఘురాంమూర్తి, రమేష్ మాట్లాడుతూ లహరిని రాఘవేంద్ర అనే తనను ప్రేమించాలని వేధించేవాడని, ఆఅమ్మాయి తిరస్కరించడంతో పెట్రోల్ పోసి దగ్ధం చేయడం అమానవీయమన్నారు. ఈ సంఘనపై ప్రభుత్వం స్పందించి నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం, లహరి తల్లికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.



నందికొట్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

అవినీతి నిర్మూలనతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ రాఘవ యాదవ్

నంద్యాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అవినీతిని నిర్మూలించనప్పుడే దేశాభివృద్ధి సాధ్యమని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ రాఘవ యాదవ్ అన్నారు. అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవ సందర్భంగా సోమవారం నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ అటానమస్ కళాశాలలో కార్యక్రమం జరిగింది. ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ రాఘవ యాదవ్, జనరల్ మేనేజర్ పూర్ణచంద్రారావు, ఆ విద్యాసంస్థల చైర్మన్ డా.రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో అవినీతి అతిపెద్ద సమస్యగా మారిందన్నారు. అవినీతినిరూపుమాపడానికి ప్రభుత్వాలు ఎన్నో చట్టాలను తీసుకువచ్చినా అవి ఆచరణకు నోచుకోవడంలేదని అభిప్రాయపడ్డారు. అవినీతి రహిత సమాజాన్ని యువత స్థాపించాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, ప్రోగ్రామ్ నోడల్ ఆఫీసర్ ఇంతియాజ్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

దుద్యాల ఎస్సీ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కొత్తపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దుద్యాల గ్రామం ఎస్సీ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీవో మేరీలను ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఈర్ల రాజు కోరారు. సోమవారం ఆయన గ్రామ ఎస్సీ కాలనీవాసులతో కలిసి ఎంపీడీవో, తహసీల్దార్లను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం రాజు మాట్లాడుతూ ఎస్సీ కాలనీకి తాగునీటి ట్యాంకులు ఏర్పాటు చేయాలని, డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయాలని, మురుగు, వర్షం నీరు బయటకు వెళ్లే విదంగా చర్యలు తీసుకోవాలన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

గడివేముల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రుణం మంజూరులో పాసు పుస్తకాలు ఇవ్వాలని నిబంధనతో రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని తహసీల్దార్ వెంకటరమణ అన్నారు. సోమవారం ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ పంట రుణాలకు తహసీల్దార్ డిజిటల్ సంతకం ఉన్న 1బీ, అడంగల్‌తో రుణాలు మంజూరు చేయాలని అన్నారు. రుణం మంజూరుకు పాసుపుస్తకాలు ఇవ్వాల్సిందేనని రైతులను ఒత్తిడికి గురి చేయవద్దని అన్నారు.

హుండీ లెక్కింపు

నంద్యాల కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రథమనందీశ్వరాలయంలో సోమవారం ఉదయం హుండీ లెక్కిపు నిర్వహించారు. దేవాలయాల ఇన్స్‌పెక్టర్ హరిచంద్రారెడ్డి, ఈవో రామానుజన్, భక్తులు, అర్చకుల ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేపట్టారు. ఆలయ హుండీని లెక్కించ గా రూ.1,70,176లు వచ్చిందని ఆలయ ఈవో తెలిపారు.

జీవో 36 ప్రకారం వేతనాలు చెల్లించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఆత్మకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం కార్మికులకు జీవోనెం.36 ప్రకారం వేతనాలు చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, ప్రసాద్, నాగరాజు, తిమ్మయ్య పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక వారు మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రజారోగ్యం కోసం అనునిత్యం శ్రమిస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు పనికి తగ్గ వేతనం అమలు చేయాలని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బాలరాజు, అశోక్, గొడుగురాజు, జోసఫ్, చిన్ననాగరాజు, వసంతరాజు, ఖాజా తదితరులు ఉన్నారు.

చంద్రబాబు హయాంలోనే ముస్లింల అభ్యున్నతి



ముస్తాక్ అహ్మద్‌ను సత్కరిస్తున్న ముస్లింలు

ఆత్మకూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు హయంలోనే ముస్లింల అభ్యున్నతి సాధ్యపడుతోందని శ్రీశైలం నియోజకవర్గం తెలుగుయువత ప్రధాన కార్యదర్శి పస్పీల్ మున్నా పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం నందు రాష్ట్ర ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ముస్తాక్ అహ్మద్‌ను ఆయన కలిసి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీ కోసం పనిచేసిన ప్రతి నాయకులను గుర్తించి కీలక బాధ్యతలను అప్పగించడం సంతోషకరమని అన్నారు. ప్రత్యేకించి రా: మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా ముస్తాక్ అహ్మద్‌ను నియమించడం పట్ల ముస్లింల అభివృద్ధికి ఎంతో దోహపడనుందని వివరించారు. ఈయన వెంట నాయకులు నాగూర్ ఖాన్, రైల్వే కోచ్ నిమ్మికృష్ణయాదవ్, వాలీబాల్ కోచ్ అజ్గర్ అలి తదితరులు ఉన్నారు.

సౌత్‌జోన్ షటిల్ పోటీల్లో రన్నరప్‌గా ఆర్‌యూ జట్టు



క్రీడాకారులను అభినందిస్తున్న డా. రామకృష్ణారెడ్డి

నంద్యాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కర్నాటకలో జరిగిన సౌత్ జోన్ ఇంటర్ కాలేజ్ గేట్ ఉమెన్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీలో రామకృష్ణ కళాశాల జట్టు రన్నర్స్‌గా నిలిచారని రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డా.రామకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో క్రీడాకారులకు అభినందనసభ నిర్వహించారు. ఆర్‌యూ షటిల్ జట్టుకు ప్రాతినిథ్యం వహించిన తమ కళాశాల క్రీడాకారులు జాతీయ స్థాయిలో మూడు పర్యాయాలు ఆర్‌యూ జట్టుకు ఆడి రన్నర్స్‌గా నిలవడం గర్వకారణమన్నారు. త్వరలో జరిగే ఖేలో ఇండియా క్రీడా పోటీల్లో ప్రాతినిథ్యం వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రన్నర్స్‌గా నిలిచిన క్రీడాకారులను డా.రామకృష్ణారెడ్డి, కళాశాల డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, ఎస్టేట్ మేనేజర్ ప్రగతిరెడ్డి తదితరులు అభినందించారు.

ఆత్మకూరులో చోరీ

ఆత్మకూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని స్వరాజ్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఆదిలక్ష్మీ అనే మహిళ ఇంట్లో చోరీ జరిగిన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఆత్మకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆదిలక్ష్మీ ఈ నెల 7వ తేదీన బెంగుళూరుకు వెళ్లారు. ఇదే అదునుగా దొంగలు పక్కా ప్రణాళికతో ఇంటి తలుపులకు ఉన్న తాళాన్ని పగులకొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. అల్మారీలో ఉన్న బీరువా తాళాలతో గుర్తించి దర్జాగా బీరువా తెరిచి అందులో భద్రపరిచిన రూ.1.7లక్షల నగదు, 3తులాల బంగారు, 10తులాల వెండిని అపహరించారు. స్కూటీ తాళాలు కూడా అక్కడ కనిపించడంతో వెళ్లేటప్పుడు స్కూటీని కూడా ఎత్తుకెళ్లాడు. అయితే సోమవారం ఇంటికి తిరిగి వచ్చిన ఆమె ఇంట్లో దొంగలు పడిన విషయాన్ని గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ అక్కడికి చేరుకుని దొంగల వేలిముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడిన యోధుడు



లక్ష్మయ్య చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

నంద్యాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడిన యోధుడు చెన్నుపాటి లక్ష్మయ్య అని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామచంద్రారెడ్డి, శివయ్య అన్నారు. ఉపాధ్యాయ ఉద్యమనేత చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి సందర్భంగా సోమవారం ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో వర్ధంతి సభను నిర్వహించారు. లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. రెండో ప్రపంచ యుద్ధకాలంలో ఉపాధ్యాయులకు కూడా రేషన్ కార్డులు మం జూరు చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మేనేజ్‌మెంట్ విద్యాసంస్థల ఉపాధ్యాయులను ఒకే యూనియన్‌గా మార్చడంలో ఆయన కృషి చిరస్మరణీయమని, ఉద్యమనేతగా ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులుగా ఆయన వ్యవహరించిన తీరు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు భాస్కర్‌రెడ్డి, వీరేశ్వర్‌రెడ్డి, దస్తగిరిబాషా, తిమ్మారెడ్డి, రాజేష్, శ్రీరాములు పాల్గొన్నారు.

గుంతల రోడ్లతో అవస్థలు



అధ్వానంగా జీసీ పాలెం, శింగవరం రోడ్డు

బండిఆత్మకూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. మండలంలోని బీ కోడూరు, వెంగళరెడ్డిపేట, కడమలకాల్వ, ఈర్నపాడు, శింగవరం, జీసీ పాలెం, నారాయణపురం, చిన్నదేవళాపురం గ్రామాలను కలుపుతూ పుష్కరాల కింద కోట్లాది రూపాయలు వెచ్చించి బీటీ రోడ్డు వేశారు. ఈ రహదారిలో నేడు ఎక్కడ చూసినా గుంతలు పడటంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. గతంలో జరిగిన ప్రమాదాల్లో ఒకరిద్దరు ప్రాణాలు కోల్పోగా, పదుల సంఖ్యలో గాయాలపాలయ్యారు. కనీసం ఈ రోడ్డులో ఆర్అండ్‌బీ అధికారులు గుంతలకు ప్యాచ్‌లయినా వేయకపోవటం విడ్డూరం. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

ఆదమరిస్తే అంతే...



కేజీ రహదారిపై తవ్వి వదిలేసిన గొయ్యి

నందికొట్కూరురూరల్ డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి) : నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరు పోలీస్ స్టేషన్ సమీపంలో కేజీ రహదారికి పక్కన భారీ పైప్‌లైన్ కోసం గుంతలు తవ్వి అలాగే వదిలేశారు. దీంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నారు. ముచ్చుమర్రి వద్ద శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి ఓర్వకల్లు ప్రారిశ్రామిక హబ్ కోసం, విమానాశ్రయం తదితరాల కోసం భారీ మంచినీటి పైప్‌లైన్‌ను కేజీ రహదారి వెంబడి తీసుకెళ్లారు. అయితే గుంతలు తవ్వి పూడ్చకుండా వదిలి అలాగే వదిలేవారు. అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

బురద మట్టితో ఇబ్బందులు



బండిఆత్మకూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈర్నపాడు, ఏ కోడూరు గ్రామాల రహదారిపై బురదమట్టి ఉండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఖరీఫ్ వరి కోతలు ముమ్మరంగా సాగుతుండడంతో పొలం నుంచి ధాన్యాన్ని తీసుకెళ్లే ట్రాక్టర్లు, కోత మిషన్లు బురద మట్టిని రోడ్లపై పడవేస్తున్నాయి. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు ఎదురుగా వస్తున్న వాహనాల లైట్ల వెలుతురుకు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు.

చేపల పెంపకంతో మత్స్యకారుల అభివృద్ధి

ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి



వెలుగోడు జలాశయంలో చేపపిల్లలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

వెలుగోడు డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నీటి వసతి ఉన్న ప్రాంతంలో చేపల పెంపకంతో మత్స్యకారుల కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. సోమవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలో 7.50 లక్షల చేపపిల్లలను ఆయన వెలుగోడు జలాశయంలో వదిలారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు వెలుగోడు జలాశయంలో రూ.15 లక్షల విలువ చేసి చేప పిల్లలను వదిలి మత్స్యకారుల జీవనోపాధికి కృషి చేస్తున్నామన్నారు. అలాగే 12.50 లక్షల చేప పిల్లలను దశల వారిగా విడుదల చేస్తామన్నారు. మత్స్యకారుల జీవనోపాధికి కావాల్సిన పరికారాలను అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశాఖ జేడీ రాఘవరెడ్డి, ఎఫ్‌డీవో భరత్‌లాల్ నాయక్, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, డీటీ చంద్రశేఖర్, టీడీపీ నాయకులు అన్నారపు శేషిరెడ్డి, కలాం, ఖలీల్, జాఖీర్, ఎల్లాల క్రిష్ణుడు, రమణ, అన్నయ్య, మధు జనసేన నాయకులు శాలుభాషా తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫాం పంట లాభదాయకం

ఆత్మకూరు రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌ఫాం పంట రైతులకు ఎంతో లాభదాయకమని ఉద్యానవనశాఖ అధికారి చందన అన్నా రు. సోమవారం ఆమె మండలంలోని శ్రీపతిరావు పేట గ్రా మంలో రైతులు సాగు చేసిన ఆయిల్ పాం పంటలను పరిశీలించారు. ఉద్యానవనశాఖ అధికారి చందన మాట్లాడుతూ ఉద్యావన శాఖ ద్వారా అయిల్‌పాం మొక్కలకు సబ్సిడీ ఇస్తున్నామన్నారు. నీటి వసతి కలిగిన రైతులు ఆయిల్‌పాం పంటకు అనుకూలమని రైతులకు సూచించారు. నవభారత్ కంపెనీ ద్వారా ఈ ఆయిల్‌పాం మొక్కలను ఉచితంగా రైతులకు అందజేస్తున్నామని, మొక్కలు కాపుకు వచ్చిన తర్వాత కంపెనీనే గెలలను కొనుగోలు చేస్తుందని, త్వరలో ఆయిల్ పాం కలెక్షన్ సెంటర్‌ను ప్రారంభిస్తామని నవభారత్ కంపెనీ మేనేజర్ ఫిరోజ్ తెలిపారు. ఆయిల్ పాం సాగు చేయాలనుకునే ఆసక్తి గల రైతులు ఉద్యావన అధికారులను గాని, రైతు సేవా కేంద్రాలను సంప్రందించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యావన సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయండి

పాములపాడు డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పంటకాల్వలను గుర్తించి రైతులకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ స్వాములు అధికారులను డిమాండ్ చేశారు. సోమవారం పాములపాడులో ఎంపిడివో కార్యలయం వద్ద నిరసన వ్యకం చేసి తహసీల్దార్ సుభద్రమ్మకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ రుద్రవరం గ్రామ శివార్లలోని గుడిపల్ల పంటకాల్వను పూడ్చడం వల్ల ఐదుమంది రైతుల పంటపొలాలకు గత మూడు సంత్సరాలుగా సాగునీరు లేక ఎండి పోతున్నాయన్నారు. అదే గ్రామంలో మరో రైతుకు పంటకు నీళ్ళు ఎక్కువ అవుతుండడంతో అడ్డు కట్ట వేయడంతో దాదాపు 15 మంది రైతుల పొలాలు మునకకు గురువతున్నాయని అన్నారు అధికారులు చొరవచూపి సమస్యలను పరిష్కరించకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

చాగలమర్రి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఆయా పార్టీ నాయకులు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఆళ్లగడ్డ సీఐ కంబగిరి రాముడు హెచ్చరించారు. సోమవారం మండలంలోని నగల్లపాడు గ్రామంలో సీఐ మాట్లాడుతూ సాగునీటి సంఘాలు, డెయిరీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో శిరివెళ్ల సీఐ వంశీధర్, ఎస్ఐలు రమేష్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఎస్‌పీజీ చర్చి వార్షికోత్సవం


ముత్యాలపాడు ఎస్‌పీజీ చర్చిలో గుడి ప్రదక్షిణ చేస్తున్న ఫాదర్లు

చాగలమర్రి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో వెలసిన 133 ఏళ్ల ఎస్‌పీజీ చర్చి వార్షికోత్సవాన్ని డీనరి చైర్మన్ సంజీవరాజ్ ఆధ్వర్యంలో సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎంతో చరిత్ర కలిగిన ఎస్‌పీజీ చర్చిలో ప్రభు సంస్కారపు ఆరాధన, కర్నూలుకు చెందిన ప్రసన్నకుమార్‌బాబు సమక్షంలో కొవ్వొత్తులతో దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. నంద్యాల ఎస్‌పీజీ డయాసిస్ వైస్ ప్రెసిడెంట్ వరప్రసాద్ ఆధ్వర్యంలో చర్చి ప్రతిష్ఠ, ఆరాధన, గుడి ప్రదక్షిణ చేశారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రతి ఒక్కరు శాంతియుత మార్గంలో నడవాలని, ప్రేమ, దయ కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్లు ప్రసన్న, సంతోష్, రాజు, గాబ్రెల్, అనిల్, స్టెఫెన్, మారడోనా, థామస్, సంఘ పెద్దలు, యూత్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి

చాగలమర్రి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో 14న నిర్వహించనున్న సాగునీటి సంఘం ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ రవికుమార్ సూచించారు. సోమవారం చాగలమర్రి వాసవీ కల్యాణ మండపంలో ఎన్నికల అధికారులు, పీవో, ఏపీవోలచే శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో పీఆర్ ఏఈ కొండారెడ్డి, ఏవో రంగనేతాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగ్గయ్య, ఎంఈవో అనూరాధ, పశువైద్యాధికారులు సాయిబాబా, దీపకుమారి పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: సాగు నీటి సంఘాల ఎన్నికల నిర్వహనకు కసరత్తు చేస్తున్నట్లు తహసీల్దారు శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో 9 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కేసీ కెనాల్ ఆయకట్టు కింద 4, ఎస్సార్బీసీ కింద 3, మైనర్ ఇరిగేషన్ కింద 2 సంఘలు ఉన్నాయన్నారు. ఈ 9 సంఘాలలో ఏడు మేజర్ సంఘాలు, రెండు మైనర్ సంఘాలు ఉన్నాయన్నారు. ఒక్కో మేజర్ సంఘానికి 12 టీసీలు, మైనర్ సంఘానికి 6 టీసీల చొప్పున మొత్తం 96 టీసీలకు ఎన్నికలు జరుగుతాయన్నారు.

వైభవంగా చండీ హోమం

చాగలమర్రి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని ఏకశిల పడుట్టాంబడి అయ్యప్పస్వామి ఆలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. గురుస్వాముల ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అయ్యప్ప విగ్రహంతో పల్లకి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

'అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి'

డోన్ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఒప్పందంలో జరిగిన అదానీ అవినీతిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడులు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో డోన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదానీతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న చీకటి ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల పట్టణ కార్యదర్శులు మోటరాముడు, నారాయణ అనుబంధ సంగాల నాయకులు రణత్ యాదవ్, పుల్లయ్య తదితరులు ఉన్నారు.

పండ్ల తోటల పరిశీలన

బేతంచెర్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.పెండేకల్ గ్రామ పంచాయతీ పరిధిలోని రేపల్లె, మర్రికుంట, పెండేకల్ గ్రామ రైతుల పొలాల్లో నాటిన పండ్ల మొక్కలను ఎంపీడీవో ఫజిల్ రెహిమాన్ సోమవారం పరిశీలించారు. నెల నెలా మొక్కల సంరక్షణకు గానూ బిల్లులు ఇవ్వాలని టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. ఏపీవో శేషన్న, ఈసీ సుబ్బా నాయక్, ఎఫ్ఏ ఎల్లస్వామి, రాజగోపాల్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వై.నాగేశ్వరరావు యాదవ్‌కు పరామర్శ


ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న రాఘవేంద్రరెడ్డి

డోన్ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్‌ను కర్నూలులోని ఆయన నివాసంలో డోన్ నియోజకవర్గ టీడీపీ యువ నాయకులు కోట్ల రాఘవేంద్రరెడ్డి పరామర్శించారు. అనారోగ్యానికి గురైన వై.నాగేశ్వరరావు యాదవ్ ఇటీవల హైదరాబాదుకు వెళ్లి చికిత్స చేయించుకుని తిరిగి కర్నూలులోని తన నివాసానికి వచ్చారు. సమాచారం తెలుసుకున్న కోట్ల రాఘవేంద్రరెడ్డి ఆయన ఇంటికి వెళ్లి నాగేశ్వరరావు యాదవ్‌ను పరామర్శించారు. ఆయన వెంట శ్రీనివాస్ భట్ ఉన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

అవుకు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గడ్డమాకులపల్లె గ్రామ పరిసర ప్రాంతాల్లోని నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహించినట్లు బనగానపల్లె ఎక్సైజ్ సీఐ వర్ధనదేవి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ గడ్డమాకులపల్లెలో విస్తృత దాడులు జరిపామన్నారు. బట్టీల వద్ద నిల్వ ఉంచిన 200 లీటర్ల బెల్లం ఊట, 30 లీటర్ల సారాను ధ్వంసం చేసినట్లు తెలిపారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిపారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంటు సీఐ కృష్ణ, ఎక్సైజ్ ఎస్ఐలు కమలాకర్, మధుసూదన్‌రెడ్డి, ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణ సమీపంలోని వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టు దగ్గర అక్రమంగా తరలిస్తున్న నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మధుసూదన్ సోమవారం తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఘనంగా పల్లకీ సేవ


యాగంటిలో పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

బనగానపల్లె, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): యాగంటి ఉమా మహేశ్వర స్వామి ఆలయంలో సోమవారం పల్లకీ సేవ ఉత్సవం సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఈవో చంద్రుడు, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, ఆలయ పూజారులు పాల్గొన్నారు.

బాలింతలకు భరోసా

- వైసీపీ పాలనలో అటకెక్కిన ఎన్టీఆర్ బేబీ కిట్స్ పథకం
- పునరుద్ధరణకు కూటమి ప్రభుత్వం నిర్ణయం


ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

కొలిమిగుండ్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మాతా శిశు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించిన ఎన్డీయే కూటమి ప్రభుత్వం నవజాత శిశు సంరక్షణ కోసం ఎన్టీఆర్ బేబీ కిట్లు మళ్లీ పంపిణీ చేయాలని నిర్ణయించింది. వైసీపీ పాలనలో అటకెక్కిన ఎన్టీఆర్ బేబీ కిట్స్ పథకాన్ని తిరిగి పట్టాలెక్కించడానికి ఇటీవలే ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకోవడంతో మహిళల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఈ పథకాన్ని మరింత పటిష్ఠంగా అమలు చేయడానికి ఇలాంటి పథకాలు అమలవుతున్న తమిళనాడు, ఝార్ఖండ్, ఒడిస్సా, తెలంగాణ రాష్ట్రాల్లో అధ్యయనం చేయాలని సీఎం చంద్రబాబు ఇప్పటికే అధికారులను ఆదేశించారు. దీంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం చేసుకునే బాలింతలకు మరింత భరోసా దక్కనుంది.

2016లో ప్రారంభమైన ఎన్టీఆర్ కిట్స్ పంపిణీ పథకం

గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో 2016లో ఈ పథకాన్ని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించారు. 2019 వరకు ఈ పథకం నిరంతరాయంగా అమలయ్యింది. ఇందులో రూ.800 విలువ చేసే సామగ్రి ఉంటాయి. అయితే ప్రస్తుతం బేబీ కిట్ విలువ మరింత పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇతర రాష్ట్రాల్లో రూ.1200 నుంచి, రూ.1300 వరకు ఖర్చు చేస్తుండటంతో, అదే స్థాయిలో రాష్ట్రంలోనూ అందజేయనున్నారు. ప్రస్తుతం ఆసుపత్రుల్లో ప్రసవం జరిగితే 24గంటల్లోపు రూ.4000 మొత్తాన్ని కూటమి ప్రభుత్వం వారి ఖాతాల్లో జమచేస్తోంది.దీనికి అదనంగా ఎన్టీఆర్ బేబీ కిట్ చేరనుంది.

వైసీపీ పాలనలో..

2019ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ఈ పథకాన్ని పూర్తిగా నిలిపివేసింది. ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం చేసుకున్న ఏఒక్కరికీ బేబీ కిట్ అందని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలపై గత ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో ఆసుపత్రుల్లో ప్రసవాలు సైతం తగ్గాయన్న ఆరోపణలున్నాయి.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో..

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే వీటిని అందుబాటులో ఉంచనున్నారు. నంద్యాల జిల్లాలో 52 పీహెచ్‌సీ కేంద్రాలు, 10యూపీహెచ్‌సీ కేంద్రాలు, జిల్లా ఆసుపత్రి ఉన్నాయి. ప్రతి పీహెచ్‌సీ కేంద్రంలో 8నుంచి 10వరకు ప్రసవాలు చేయాలని ప్రయత్నిస్తున్నా, పూర్తి స్థాయిలో సక్సెస్ కాలేకపోతున్నారు. ఇప్పటి వరకు రూరల్ పీహెచ్‌సీ కేంద్రాల్లో సైతం 5వరకు ప్రసవాలు జరుగుతున్నట్లు అంచనా. జిల్లాలో ఏటా 1000 నుంచి 1500 మంది బాలింతలకు ఎన్టీఆర్ బేబీ కిట్స్ పంపిణీతో లబ్ధి చేకూరనుంది.

ఆదేశాలు రాలేదు



ఎన్టీఆర్ బేబీ కిట్స్ పథకంపై ప్రభుత్వం నుంచి ఇంకా ఆదేశాలు అందలేదు. ప్రభుత్వం నుంచి బేబీ కిట్లు మంజూరు కాగానే పంపిణీ ప్రారంభిస్తాం.
- హరిచరణ్‌రెడ్డి, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు

మార్చి నాటికి ఇంటింటికి తాగు నీరు: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డోన్ నియోజకవర్గంలో వచ్చే మార్చి నాటికి ఇంటింటికి తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ బూత్ కమిటీల సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో 60వేల టీడీపీ పార్టీ సభ్యత్వ లక్ష్యాలు లక్ష్యం కాగా.. ఇప్పటికే 40వేలు సభ్యత్వాలను పూర్తి చేసినట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు పరిచేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. ప్రజలకు, రైతులకు సాగు నీరు, తాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ఇందులో భాగంగా వాటికి కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వం నుంచి అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతామన్నారు.

నేడు ఎమ్మెల్యే కోట్ల రాక

ప్యాపిలి: ప్యాపిలి పట్టణానికి మంగళవారం డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి రానున్నట్లు సోమవారం టీడీపీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ఆయన స్థానిక షాదీఖానాలో నిర్వహించే కార్యకర్తల సమావేశంలో పాల్గొననున్నట్లు తెలిపాయి. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని పార్టీ వర్గాలు కోరాయి.

ప్రజలను మభ్యపెడుతున్నారు


సమావేశంలో మాట్లాడుతున్న వలసల రామకృష్ణ తదితరులు

డోన్ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్రీయ విద్యాలయం డోన్‌కు రావడంపై వైసీపీ నాయకులు ప్రజలను మభ్యపెడుతున్నారనీ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ విమర్శించారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో టీడీపీ మండల అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ వడ్డె మహారాజ్, వలసల గ్రామ టీడీపీ నాయకులు వలసల బాలుడుతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో వలసల రామకృష్ణ మాట్లాడారు. కేంద్రీయ విద్యాలయం డోన్ పట్టణానికి రావడం వెనుక మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విశేష కృషి ఉందని వైసీపీ నాయకులు ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారనీ అన్నారు. ప్రస్తుతం ఉన్న ఎన్డీయే కూటమిలో టీడీపీ భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌కు ఎనిమిది కేంద్రీయ విద్యాలయాలు వచ్చాయన్నారు. అందులో భాగంగా డోన్‌కు మంజూరై క్యాబినెట్ ఆమోదంతో కేంద్రీయ విద్యాలయం అకడమిక్ ఇయర్‌లో ప్రారంభం కానున్న సందర్భంలో వైసీపీ నాయకులు తమ నాయకుడి కృషే అంటూ కృతజ్ఞత ర్యాలీలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

ఇంటింటి సర్వే పరిశీలన


సర్వేను పరిశీలిస్తున్న జిల్లా నోడల్ అధికారి కాంతారావు నాయక్

శిరివెళ్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇంటింటి వ్యాధుల సర్వే నిర్వహిస్తున్నట్లు జిల్లా నోడల్ అధికారి కాంతారావు నాయక్ తెలిపారు. సోమవారం ఆయన శిరివెళ్ల ఆరోగ్య ఉప కేంద్రాల పరిధిలో జరుగుతున్న క్యాన్సర్, బీపీ, షుగర్ వ్యాధుల సర్వేను పరిశీలించారు. 18 సంవత్సరాలు దాటిన వ్యక్తులకు బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలు, 30 సంవత్సరాలు దాటిన వారికి నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. అసంక్రమిత వ్యాధులను ముందస్తుగా గుర్తించి నిర్ధారిత కేసులకు సకాలంలో చికిత్స అందిస్తే మరణాల బారిన పడకుండా కాపాడుకోవచ్చని వెల్లడించారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి, ఎమ్ఎల్‌హెచ్‌పీ వసంత, ఆరోగ్య సిబ్బంది లక్ష్మీ దేవి, రజిని, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి

● రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు


సమావేశంలో పాల్గొన్న వైసీపీ నాయకులు

డోన్ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు అన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీరాములు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో నాటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఢిల్లీకి పలుమార్లు వెళ్లి ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్‌తో మాట్లాడి డోన్‌కు కేంద్రీయ విద్యాలయం మంజూరు చేయడంలో విశేష కృషి చేశారన్నారు. వాస్తవం తెలియక కొందరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. సమావేశంలో డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు బద్దెల రాజ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్, నాయకులు మల్లెంపల్లి రామచంద్రుడు, పోస్టు ప్రసాద్, ఆర్ఈ రాజావర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సోనియా జన్మదినం

కోవెలకుంట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అగ్రనాయకురాలు సోనియాగాంధీ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి బాలుయాదవ్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో బాలన్న, సత్యం, బాలయ్య, ఓబులేసు, శ్రీను, మల్లిఖార్జునచామచంద్రుడు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

కోవెలకుంట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న కంపచెట్లలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ మల్లిఖార్జునరెడ్డి సోమవారం తెలిపారు. వీరి నుంచి రూ.5800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవాలు సురక్షితం

ఉయ్యాలవాడ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాలు సురక్షితమని మండల వైద్యాధికారి కెనెడీ అన్నారు. సోమవారం ఆస్పత్రిలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సీహెచ్‌వో లక్ష్మీ, ఎంపీహెచ్ఎస్ మునిస్వామి, ఏఎన్ఎంలు ఉన్నారు.

ఇద్దరు డైరెక్టర్లు ఏకగ్రీవం

రుద్రవరం డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం గ్రామానికి చెందిన విజయ పాల సొసైటీ డైరెక్టరు ఎన్నికలు సోమవారం ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి శ్రీనివాసులు తెలిపారు. కొత్తగా కాణాల జయలక్ష్మి, బత్తుల నాగేశ్వరమ్మ అనే ఇద్దరు మహిళలను డైరెక్టర్లుగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల సొసైటీ అధ్యక్షురాలు అవుల లక్ష్మీదేవి ఉన్నారు.

కాలుష్యాన్ని నియంత్రించాలి

కొలిమిగుండ్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వటా, మీర్జాపురం, నందిపాడు గ్రామాల్లో సిమెంట్ ఫ్యాక్టరీ వల్ల ఏర్పడుతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెనసెల్‌లో , అలాగే పొల్యూషన్ బోర్డు అధికారులకు కూడా వినతిపత్రం సమర్పించారు. నిత్యం దుమ్ము, ధూళి వల్ల పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఫిర్యాదు చేశారు. మూడు గ్రామాలకు చెందిన రైతులు నాగేశ్వరరెడ్డి, మహేశ్వరరెడ్డి, రామచంద్రారెడ్డి, చంద్రమోహన్, శరత్‌చంద్రరెడ్డి, కుమార్‌రెడ్డి, నాగమ్మ, శివ రాం గంగల శ్రీకాంత్‌రెడ్డి, బోయ రామ్మోహన్, నటరాజ్ చెడ్డి, చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

కూలిన మట్టిమిద్దె .. తప్పిన ప్రమాదం


కూలిన మట్టి మిద్దె

రుద్రవరం డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదలూరు గ్రామంలో సోమవారం తెల్లవారుజామున మట్టి మిద్దె కూలింది. గ్రామానికి చెందిన అడవన్న అనే వ్యక్తికి చెందిన మట్టిమిద్దె ఇటీవల కురిసిన వర్షాలకు బాగా తడిచి ఒకసారిగా కూలినట్లు తహసీల్దారు మల్లిఖార్జునరావు తెలిపారు. ఎలాంటి ప్రమాదం జరగలేదన్నారు. వీఆర్వో చంద్రమోహన్ వివరాలు సేకరించినట్లు తహసీల్దారు తెలిపారు.

భక్తిభావంతో ఉండాలి

సంజామల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసంలో హిందువులు భక్తిభావంతో ఉండాలని త్రైత సిద్ధాంత ప్రబోదా సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షులు బాలయ్య, సభ్యులు అన్నారు. సోమవారం సంజామలలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హిందూ జ్ఞాన వేదిక త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక కమిటీ సభ్యులు రామానంద, బాబు, సురేష్, గణపతి, పెద్దయ్య, మల్లేష్, ప్రభాకర్ రెడ్డి, కృష్ణ, గంగాధర్, నాగేంద్ర ప్రసాద్, దత్తేశ్వర రెడ్డి, చంద్ర మోహన్ , శ్రీదేవి, రేష్మా, గ్రామస్థులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై సీపీఐ ధర్నా

బేతంచెర్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వ వైఫల్యాలను వ్యతిరేకిస్తూ సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ ప్రకాష్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్, తిరుమలేష్, డి.దస్తగిరి, పి.నాగరాజు, ఉదయ్, ఎల్లకృష్ణ, శ్రీకర్, జగదీష్, కిషోర్, సంతోష్ పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలకు తరలిన నాయకులు

బేతంచెర్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరులో జరిగే సీపీఎం రెండో జిల్లా మహసభలకు పార్టీ సీనియర్ నాయకులు ఎల్లయ్య, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బేతంచెర్ల నుంచి సోమవారం పలువురు బయలుదేరి వెళ్లారు. సభలలో భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను గురించి చర్చించనున్నట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- ఎంపీడీవో భాగ్యలక్ష్మి



రుద్రవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గ్రామాల అభివృద్ధే లక్ష్యమని ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. రూ.1.63 కోట్లతో 26 సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. సోమవారం ఎంపీడీవో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: సచివాలయ సిబ్బంది పని తీరును పర్యవేక్షిస్తున్నారా?

జవాబు: మండలంలోని సచివాలయాలను తనిఖీ చేస్తూ సిబ్బంది పనితీరును పర్యవేక్షిస్తున్నాం. 16 సచివాలయాలు 136 మంది ఉద్యోగులున్నారు. సమయపాలన పాటించని వారికి రెండురోజుల్లో 78 మందికి మెమోలు జారీ చేశాం.

ప్రశ్న: పారిశుధ్య పనులు చేయిస్తున్నారా?

జవాబు: గ్రామాల్లో ప్రతి వారం పారిశుధ్య పనులు చేయించి, బ్లీచింగ్ పౌడర్, వేస్టాయిల్ చల్లించి అవసరమైన చోట్ల సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మిస్తున్నాం.

ప్రశ్న: సర్వసభ్య సమావేశాల్లో సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించారా?

జవాబు: ఇప్పటి వరకు వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేశాం. పరిష్కరించేలా అధికారులకు సూచనలు చేశాం.

ప్రశ్న: చెత్త కేంద్రాల్లో సంపద ఉత్పత్తి జరగడం లేదా?

జవాబు: గ్రామాల్లో చెత్త సేకరిస్తున్నాం. సంపద ఉత్పత్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. దాంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తాం.

ప్రశ్న: పంచాయతీ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు కదా?

జవాబు: సొంత భవనాలు లేని పంచాయతీలను గుర్తించి భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తాం.

ప్రశ్న : గ్రామాల్లో వీధిదీపాలు సరిగ్గా వెలగడం లేదు?

జవాబు : గ్రామాల్లో వీధిదీపాలు వెలిగేలా చర్యలు తీసుకున్నాం. అన్ని గ్రామాల్లో సమాచారం తెలుసుకుని వీధి దీపాలు వెలిగేలా చూస్తాం.

'హిందువులంతా ఏకం కావాలి'

శిరివెళ్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : విజయవాడలో త్వరలో జరగనున్న హైందవ శంఖారావానికి హిందువులంతా ఏకం కావాలని విశ్వహిందూపరిషత్ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు వైవీ రామయ్య పిలుపునిచ్చారు. మండలంలోని గోవిందపల్లె గ్రామంలో సోమవారం ఆయన మాట్లాడుతూ శౌర్య దివాస్, గీతా జయంతి సందర్భంగా శిరివెళ్ల ప్రఖండలోని శిరివెళ్ల గ్రామంలో ఈ నెల 11న సాయంత్రం శివాలయం వద్ద నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. హిందూ దేవాలయాల నిర్వహణ బాధ్యతలను హిందూ సమాజానికి అప్పగించాలని చేస్తున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్ ప్రతినిధులు సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, కమతం రాజశేఖర్‌రెడ్డి, చంద్ర, పార్వతీశం, నాగిరెడ్డి, నరసింహారెడ్డి, నాగమల్లేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా చెన్నుపాటి వర్ధంతి

ప్యాపిలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఉద్యమ నేత చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతిని సోమవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నుపాటి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు లతీఫ్, నరసింహారెడ్డి, బొజ్జన్న పాల్గొన్నారు.

సీసీ రోడ్లు నిర్మించాలి

ప్యాపిలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తమ కాలనీలో సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని మండలంలోని వెంగళాంపల్లి గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ వాసులు కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసరావు కు వినతి పత్రం అందజేశారు. రోడ్లు లేకపోవడం వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. కాలనీని పరిశీలించి రోడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హామీ ఇచ్చారు. కాలనీకి చెందిన మధుక్రిష్ణ, హరి, ప్రతాప్ తదితరులు వినతి పత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

బనగానపల్లె వాసికి డాక్టరేట్


వినయ్‌కుమార్‌రెడ్డి

బనగానపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లెకు చెందిన తేజ వినయ్‌కుమార్‌రెడ్డి డాక్టరేట్ అందుకున్నారు. విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీలో సివిల్ ఇంజినీర్‌లో ప్రొఫెసర్ సంజిత్ కుమార్ మార్గదర్శకత్వంలో హైవే ఇంజినీరింగ్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ అనే అంశంపై విస్తృత పరిశోధనలు చేసి పత్రాలు సమర్పించారు. కేఎల్ యూనివర్సిటీ 14వ స్నాతకోత్సవ వేడుకల్లో గవర్నర్ అబ్దుల్ నజీర్ , భారత మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవింద్, వీసీ పట్టాను అందజేశారు.

లో వోల్టేజీ సమస్య పరిష్కారం

బనగానపల్లె , డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని కొండపేట వీధిలోని పెద్ద పీర్లచావిడి, శివనంది నగర్‌లలో నిత్యం ఎదుర్కొంటున్న లోవోల్టేజీ సమస్య రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చొరవతో పరిష్కారం అయినట్లు పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, టీడీపీ నాయకులు అత్తార్ కలాం సోమవారం తెలిపారు. కొండపేటలో లోవోల్టేజీ సమస్య ఉందని స్థానికులు, టీడీపీ నాయకులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన సమస్యను పరిష్కరించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. దాంతో 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చారు. దీంతో లోవోల్టేజీ సమస్య తీరింది. సమస్యను పరిష్కరించిన మంత్రి బీసీకి టీడీపీ నాయకులు ముజిబ్, హనీఫ్, రహింనాయక్, కరాటే బాషా కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి పనులపై విచారణ

చాగలమర్రి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబోదనం, తోడెండ్లపల్లె, కేపీ తండా, శెట్టివీడు, డి.వనిపెంట, చాగలమర్రి, నేలంపాడు గ్రామాల్లో సామాజిక బృందం డీఆర్పీలు సోమవారం విచారణ చేపట్టారు. ఆయా గ్రామాల్లో చేసిన ఉపాధి పనులపై కూలీల నుంచి వివరాలు సేకరించారు. హార్టికల్చర్, సీసీ రోడ్లు, సచివాలయాలు, మస్టర్లను పరిశీలించారు.

శనగ సాగులో మెలకువలు పాటించాలి

చాగలమర్రి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శనగ సాగులో రైతులు మెలకువలు పాటించాలని ఏవో రంగనేతాజీ తెలిపారు. సోమవారం వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసిన శనగ పంటలో తెగుళ్ల సోకడంతో పంట పసుపు రంగుగా మారి దెబ్బతింటుందని, వీటిని గమనించి వ్యవసాయ అధికారుల సూచనల మేరకు తగిన మందులు వాడి నివారించుకోవాలని అన్నారు. ఏఈవోలు, వీహెచ్ఏలు ఉన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే ప్రజా వేదిక

చాగలమర్రి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం ప్రజావేదిక కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం చాగలమర్రి తహసీల్దార్ కార్యాలయంలో మండలస్థాయి ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ రవికుమార్, అధికారులు పాల్గొన్నారు.